జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్



PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA

దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 5 ॥ గురువారం॥ 4-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-




ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగు నీటి ప్రాజెక్టుల పురోగతిని స్వయంగా పరిశీలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజుల పర్యటనకు వస్తు న్నారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు నారాయణపేట జిల్లా మక్తల్ హెలిప్యాడ్‌కు చేరుకోవడంతో ఆయన పర్యటన ప్రారంభమవుతుంది. సీఎం తోపాటు ఈ పర్యటనలో ఉప ముఖ్యమం త్రి మల్లు భట్టి విక్రమార్క ఇతర సీనియ ర్ మంత్రులు పాల్గొంటారని ఉత్తమ్ కు మార్ రెడ్డి చెప్పారు. మొదట మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం మరియు భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల పనులను సీఎం పరిశీలిస్తారు. అధికారులు అక్కడే ప్రాజె క్టుల పనుల పురోగతిని ముఖ్యమంత్రికి మ్యాపుల ద్వారా వివరించనున్నారు.

## మక్తల్ కొడంగల్ ఎత్తిపోతల, పాలమూరు రంగారెడ్డి

# పనులపై ఫోకస్

**నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో 2 రోజులు సీఎం రేవంత్ పర్యటన**

**జూరాల, కోయిల్ సాగర్ సహా పలు ప్రధాన రిజర్వాయర్లపై ఏరియల్ సర్వే**

**ప్రాజెక్టుల పురోగతిపై సోమశిల వేదికగా రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష**

**రేపు సాయంత్రం జడ్చర్ల మండలం ఉద్దండాపూర్‌లో భారీ బహిరంగ సభ**

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, జిల్లా అధికార యంత్రాంగం**

మహబూబ్‌నగర్, జూన్ 03: మక్తల్ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా ఏరియల్ వ్యూ పరిశీలన జరుపుతారు. కోయిల్ సాగర్ ప్రాజెక్టు, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డ్యామ్ ప్రాంతం, కృష్ణా భీమా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల నిర్మాణ స్థలాలను ఆకాశ మార్గం నుంచి సర్వే చేస్తారు. అనంతరం గద్వాల జిల్లా గూడెందొడ్డి రిజర్వాయర్, జేఎన్ఎల్ఐఐఎస్ స్టేజ్ ఒకటి పంప్‌హౌస్ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తారు. రాత్రి ఆరు గంటలకు సోమశిల చేరుకుని మృగవాణి రిసార్ట్‌లో రాత్రి ఎనిమిదిన్నర గంటల వరకు సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా ఎల్లూరు పంప్‌హౌస్‌కు తరువాయి 2 వ పేజీలో...

# దిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

**21 మంది సజీవ దహనం!**

**హోటల్‌లో చెలరేగిన మంటలు**

**ప్రమాదంపై పీఎం మోదీ తీవ్ర దిగ్భ్రాంతి**



న్యూఢిల్లీ, జూన్ 3: దేశ రాజధాని దిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దక్షిణ దిల్లీలోని మాలవీయ నగర్, హౌజ్‌రానీ ప్రాంతంలో ఉన్న 'ఫ్లరి ష్ స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' హోటల్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో.. అందులో బస చేసిన పలు వురు విదేశీయులతో సహా మొత్తం 21 మంది సజీవ దహనమయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ తరువాయి 2 వ పేజీలో...

## డీఎస్సీ నియామకాలు

# అత్యంత పారదర్శకం

**గొడ్డలి పార్టీకి విధ్వంసం తప్ప ఏమీ చేతకాదు**

**సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం**

**కేంద్ర మార్గదర్శకాల ప్రకారమే స్పోర్ట్స్ కోటా భర్తీ**

**పేటీఎం బ్యాచ్ లతో ప్రభుత్వంపై దుష్ప్రచారం**

**7 -14 రోజుల పాటు యోగాంధ్ర మహోత్సవం**



అమరావతి, జూన్ 03: ప్రత్యర్థి పార్టీకి విమర్శలు, విధ్వంసం తప్ప మరేమీ చేతకాదని, వారిని గొడ్డలి పార్టీగా అభివర్ణిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఘాటుగా తిప్పికొట్టారు. ఆరోగ్యకరమైన రాజకీయాలు చేయలేని వారిని ప్రజలే బహిష్కరించాలని పిలుపునిచ్చారు. విభజన జరిగి 12 ఏళ్లు గడిచిపోయాయని, ఈ సమయంలో ప్రజలకు ఎవరు మంచి చేశారో అందరికీ తరువాయి 2 వ పేజీలో...

## తెలంగాణ హైవేలకు రూ.7,597 కోట్లు

**జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్**

**ఆర్మూర్, జగిత్యాల, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్ రోడ్ల అభివృద్ధి**

**గంటకు వంద కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఓపెన్ టోలింగ్**

**హైవేల నిర్మాణ ప్రక్రియ ద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు**




న్యూఢిల్లీ, జూన్ 3: తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం భారీ నిధులను మంజూరు చేసింది. ఆర్మూర్ జగిత్యాల మంచిర్యాల మరియు జగిత్యాల కరీంనగర్ రహదారులను రూ. 7,597 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు వరుసల రహదారులుగా విస్తరించేందుకు ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం నూట తొంభై కిలోమీటర్ల మేర రహదారులను 4 వరుసలుగా విస్తరించను న్నారు.

**మూడు ప్యాకేజీలుగా పనులు**

ఈ భారీ ప్రాజెక్టును మొత్తం మూడు వర్క్ ప్యాకేజీలుగా విభజించినట్లు కేంద్ర -2 వ పేజీలో...




## తెలంగాణ భావోద్వేగం గొప్పది..

# ఏపీలో ఆంధ్రా ఉనికి ఏది?

**మహనీయుడు పొట్టి శ్రీరాములుకూ కులం రంగు పూస్తారా?**

**తెలంగాణ ఎవరి జాగీరూ కాదు.. పోటీ చేసేది అక్కడి భూమిపుత్రులే!**

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు**

ఆంధ్రప్రదేశ్ సామాజిక, రాజకీయ సమీకరణాలపై ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనంగా మారాయి. బుధవారం అమరావతి పర్యటనలో భాగంగా ఆయన 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

అమరావతి, జూన్ 03: అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రెండు రాష్ట్రాల ప్రజల ఆలోచనా విధానాలు, ప్రాంతీయ ఉనికి, కుల రాజకీయాలపై తన మనోగతాన్ని కుండ బద్దలు కొట్టినట్లు పంచుకున్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే ఏ చర్యలనైనా తాను గట్టిగా అడ్డుకుంటానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ సమాజంలో ఆ రాష్ట్ర ప్రజలకు తమ ప్రాంతం పట్ల ఒక బలమైన నినాదం, ఉనికి, భావోద్వేగభరితమైన కనెక్టివిటీ ఉన్నాయని పవన్ కళ్యాణ్ కొనియా డారు. అయితే, దురదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు 'ఆంధ్రా' అనే ఒక ప్రాంతీయ ఉనికి, అస్తిత్వం తరువాయి 2 వ పేజీలో...



## ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎక్కడైనా

# పోటీ చేయవచ్చు

**ప్రాంతీయవాదంపై పవన్ వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్**

**ప్రధాని మోదీ ఆర్థిక ప్రాంతీయవాదంపై నిలదీత**

**సెక్రటేరియట్‌లో పెత్తనం చెలాయిస్తే ఊరుకోబోం**

**పవన్ సినిమాల్లోనే ఓజీ, మా ఓజీ కేసీఆరే: కేటీఆర్**

తెలంగాణ రాష్ట్రం ముమ్మాటికీ ఇక్కడి భూమిపుత్రుల జాగీరేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ మీ అయ్య జాగీరా అంటూ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు ఆయన హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ గట్టి కౌంటర్ ఇచ్చారు.

హైదరాబాద్, జూన్ 3: తెలంగాణ ప్రజల కు ఎవరి దగ్గరా దేశభక్తి పాఠాలు నేర్చుకోవా ల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎవరైనా ఎక్కడైనా పార్టీ పెట్టి పోటీ చేసుకోవచ్చని, అయితే ఈ నేల పోరా టాలు మరియు బలిదానాలను గౌరవించాలని హితవు పలికారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదం కంటే ప్రమాదకరమని పవన్ అనడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం నాడు పొట్టి శ్రీరాములు -2 వ పేజీలో...



## తెలంగాణ-జర్మనీ మధ్య బంధం

**సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సహకారానికి ఒప్పందం**

# నేటి రాశి ఫలాలు

**మేషం :** మీ కృషికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. శ్రమకు తగ్గ పురోగతి సాధించే అవకాశం ఉంది. వ్యాపార రంగంలో కొత్త అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగంలో చురుకుదనం ప్రదర్శిస్తే ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. సూర్యధ్యానం విజయాన్నిస్తుంది.

**వృషభం :** కృషికి తగిన ఫలితం వస్తుంది. బంధుమిత్రుల సహకారం మీలో ఉత్సాహాన్ని పెంచుతుంది. పాత విభేదాలు తొలగి బంధాలు మెరుగుపడతాయి. విలువైన వస్తువుల కొనుగోలు ఆనందాన్ని కలిగిస్తుంది. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం నూతన ఉత్సాహాన్ని కలిగిస్తుంది.

**మిథునం :** ఆత్మవిశ్వాసమే మీ విజయానికి ప్రధాన ఆధారం అవుతుంది. ఆటంకాలను సమర్థంగా అధిగమిస్తారు. సమాజంలో గౌరవం, గుర్తింపు పెరుగుతాయి. బంధుమిత్రులతో కలిసి చేపట్టిన పనులు సానుకూల ఫలితాలనిస్తాయి. ఇష్టదేవతా స్తోత్ర పారాయణం ఆత్మబలాన్ని పెంచుతుంది.

**కర్కాటకం :** సహచరుల సహకారంతో పనులు విజయవంతమవుతాయి. స్థిరమైన నిర్ణయాలు మంచి ఫలితాలను అందిస్తాయి. చిన్న చిన్న విభేదాలను పట్టించుకోకుండా ముందుకు సాగాలి. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. శివనామ స్మరణ మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.

**సింహం :** ఆటంకాలు ఎదురైనా మనోధైర్యం కోల్పోవద్దు. సహనం, పట్టుదల మీకు విజయాన్ని అందిస్తాయి. ఆరోగ్య సంరక్షణపై దృష్టిపెడితే మంచిది. ఆలోచించి తీసుకునే నిర్ణయాలు మేలు చేస్తాయి. నవగ్రహ శ్లోక పఠనం ప్రతికూలతలను తగ్గిస్తుంది.

**కన్య :** కొన్ని సవాళ్లు ఎదురైనా పట్టుదలతో విజయాన్ని సాధిస్తారు. కుటుంబ సభ్యుల సలహాలు మార్గదర్శకంగా నిలుస్తాయి. శారీరక శ్రమ పెరిగినా ఫలితం సంతృప్తికరంగా ఉంటుంది. దుర్గా శ్లోక పఠనం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

**తుల :** మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయి. ధైర్యంగా ముందడుగు వేస్తే విజయాలు మీవే అవుతాయి. గోవింద నామస్మరణ మనోధైర్యాన్ని, ఉత్సాహాన్ని పెంచుతుంది.

**వృశ్చికం :** భవిష్యత్తుకు అనుకూలమైన పరిణామాలు కనిపిస్తున్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో శుభఫలితాలు సాధిస్తారు. ఒక శుభవార్త మీలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. సూర్యారాధన విజయమార్గాన్ని చూపుతుంది.

**ధనుస్సు :** మీ ప్రయత్నాలకు తగిన ఫలితాలు లభిస్తాయి. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మిత్రుల సహకారం మేలు చేస్తుంది. మానసిక దృఢత్వం మీకు నూతన అవకాశాలను అందిస్తుంది. శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. సూర్యశ్లోక పఠనం శుభప్రదం.

**మకరం :** మంచి ఫలితాలు మీకు అనుకూలంగా ఉన్నాయి. శుభ కార్యక్రమాల్లో పాల్గొని ఆనందాన్ని పంచుకుంటారు. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆత్మీయులతో గడిపే సమయం సంతోషాన్నిస్తుంది. ఇష్టదైవ దర్శనం ఆత్మసంతృప్తిని కలిగిస్తుంది.

**కుంభం :** శారీరక శ్రమ అధికంగా ఉన్నప్పటికీ ఫలితం ఆనందాన్నిస్తుంది. బంధువులతో మితంగా, మృదువుగా వ్యవహరించడం మంచిది. ఖర్చులపై నియంత్రణ పాటిస్తే ఆర్థికంగా మేలు జరుగుతుంది. శని ధ్యానం స్థిరబుద్ధిని, సహనాన్ని ప్రసాదిస్తుంది.

**మీనం :** మీ ఓర్పు, సహనం విజయానికి పునాది అవుతాయి. కొన్ని పనులు ఆలస్యమైనా అనుకూల ఫలితాలు తప్పక లభిస్తాయి. భయాందోళనలను దూరంగా ఉండాలి. ధైర్యంగా ముందుకు సాగాలి. ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తే పరిస్థితులు అనుకూలిస్తాయి. నవగ్రహ ధ్యాన శ్లోక పఠనం ధైర్యాన్ని, మనోబలాన్ని పెంచుతుంది.



# ప్రాంతీయ అస్తిత్వం ముఖ్యం!



మొదటి పేజీ తరువాయి

కనిపించకుండా పోయిందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో ప్రాంతీయ ఉనికి స్థానంలో కేవలం కులాల కొట్లాటలు, కుల రాజకీయాలే ఎక్కువగా రాజ్యమేలు తున్నాయని విమర్శించారు. నిరుద్యోగం, రాష్ట్ర అభివృద్ధి గురించి పట్టించుకోకుండా కేవలం కులాల కుంపట్లు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

### పరాకాష్టకు కుల దూషణలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుల రాజకీయాలు విపరీతంగా పెరిగాయని, కుల దూషణల సంస్కృతి పరాకాష్టకు చేరిందని పవన్ కళ్యాణ్ ధ్వజమెత్తారు. కొందరు సోషల్ మీడియా వేదికగా కులాల పేరుతో అసభ్యకర మైన దూషణలకు దిగుతున్నారని, ఇష్టం వచ్చినట్లు మాట్లాడి కులం వెనుక దాక్కొనే సంస్కృ తి పెరిగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం తన ప్రాణాలనే త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహానుభావుడిని కూడా ఏపీలో ఏదో ఒక కులానికి పరిమితం చేసి, ఆయనకు కులం రంగు అంటగట్టడం అత్యంత దారుణమని ఆవేదన చెందారు. మహనీయులను ఇటువంటి కులచట్రాల్లో బిగించడం రాజకీయాల్లో అలవాటుగా మారిందని విమర్శించారు.

### కుట్రల అంతానికే 'సేనాగళం' కమిటీ

రాష్ట్రంలో నెలకొన్న ఇటువంటి కలుషిత వాతావరణాన్ని, కుల దూషణలను అడ్డుకోవడానికే జనసేన తరఫున 'సేనాగళం' అనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఈ కమిటీలో అన్ని వర్గాల నాయకులకు చోటు ఉంటుందని, సమాజంలో విద్వేషాలకు ముగింపు పలకా లనేదే తన ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.

### తెలంగాణ ఎవరి జాగీరూ కాదు!

తెలంగాణలో జనసేన పార్టీ భాగస్వామ్యంపై, అక్కడ పోటీ చేయడంపై వస్తున్న విమర్శలకు అర్థం లేదని పవన్ కళ్యాణ్ తోసిపుచ్చారు. తెలంగాణ ఎవరి జాగీరూ కాదని, అక్కడ పోటీ చేసే హక్కు కేవలం కొందరికే ఉంటుందని అనడం సరికాదన్నారు. ఇతరులను రానివ్వబోమని అభ్యంతరాలు చెప్పడం తగదని హితవు పలికారు. తెలంగాణలో పార్టీ ఆఫీసు తీసేసినా, అక్కడి నాయకులు, జనసైనికులు ఇప్పటికీ బలంగానే ఉన్నారని గుర్తుచేశారు. నిన్న జరిగిన కొన్ని పరిణామాల వల్లే తాను తెలంగాణలో పోటీపై ప్రకటన చేయాల్సి వచ్చిందన్నారు.

### పోటీ చేసేది తెలంగాణ బిడ్డలే..

ఆంధ్రప్రదేశ్ నాయకులు ఎవరూ వెళ్లి తెలంగాణలో పోటీ చేయడం లేదని, ఈ విషయంలో అనవసరంగా విద్వేషాలు రేపుతున్నారని పవన్ కళ్యాణ్ స్పష్టత ఇచ్చారు. తెలంగాణలో జనసేన తరఫున అక్కడి స్థానికులు, ఆ నేల మీద పుట్టిన భూమిపుత్రులే పోటీ చేస్తారని తెలిపారు. తెలంగాణ బిడ్డలు పోటీ చేస్తామంటే అభ్యంతరం ఎందుకు? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని కొందరు చినికి చినికి గాలివానలా మార్చారని, దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా లేదా అని తాను ఖచ్చితంగా చెప్పలేనప్పటికీ, ప్రాంతాల మధ్య విద్వేషాలు పెంచడం సరికాదన్నారు.

### కేటీఆర్ నా సోదరుడు.. గద్దర్ కుటుంబంపై గౌరవం ఉంది

తెలంగాణ సమాజం అన్నా, అక్కడి ప్రజలన్నా తనకు ఎంతో గౌరవం ఉందన్న పవన్.. ప్రజా గాయకుడు గద్దర్ వంటి మహానుభావులు ఎప్పుడూ ఇతరులను తెలంగాణలోకి రావొద్దని మాట్లాడలేదని గుర్తుచేశారు. గద్దర్ కుటుంబ సభ్యుల పట్ల తనకు ఎనలేని గౌరవం ఉందన్నారు. అలాగే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనకు సోదరుడితో సమానమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అయితే, ఈ వివాదంపై కేటీఆర్ ఏం మాట్లాడారో తాను ఇంకా వినలేదని చెప్పారు. తాము ఎల్లప్పుడూ తెలంగాణ అభివృద్ధి కోసం, దేశ సమగ్రత కోసం పనిచేస్తామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.



# పనులపై ఫోకస్

మొదటి పేజీ తరువాయి

సీఎం చేరుకుంటారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్యాకేజీ మూడు హెడ్ రెగ్యులేటర్, నార్లాపూర్ రిజర్వాయర్, ఎమ్‌జీకేఎల్ఐఎస్ లిఫ్ట్ ఒకటి పంప్‌హౌస్‌లను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఏదుల రిజర్వాయర్ పనులను ఏరియల్ వ్యూ ద్వారా తనిఖీ చేసి, కుమ్మెర వద్ద పీఆర్ఎల్ఐఎస్ ప్యాకేజీ ఎనిమిది పంప్‌హౌస్, వట్టెం రిజర్వాయర్ పనులను నిశితంగా పరిశీలిస్తారు. మధ్యాహ్నం కొత్తూరు చేరుకుని కరివేన రిజర్వాయర్ పనులను చూసిన అనంతరం మీడియాతో మాట్లాడతారు.

### ఉద్దండాపూర్‌లో

### భారీ బహిరంగ సభ

పర్యటన ముగించుకునే క్రమంలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు జడ్చర్ల మండలం ఉద్దండాపూర్ రిజర్వాయర్ ప్యాకేజీ పనులను ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. సాయంత్రం ఆరున్నర గంటల నుంచి ఉద్దండాపూర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సభ ముగిసిన అనంతరం రాత్రి ఏడున్నర గంటలకు సీఎం హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు.

### సర్కారు యంత్రాంగం అప్రమత్తం

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కరివేన జలాశయం వద్ద జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ జానకి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. జడ్చర్ల కల్వకుర్తి ఎక్స్ రోడ్ వద్ద హెలిప్యాడ్ మరియు భద్రతా ఏర్పాట్లను మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లను వేగంగా పూర్తి చేస్తున్నారు.

# డీఎస్సీ నియామకాలు అత్యంత పారదర్శకం

మొదటి పేజీ తరువాయి

తెలుసని.. అనవసర వివాదాలు సృష్టించడం మానుకుని, ప్రజలకు మేలు చేయడంలో రాజకీయ పార్టీలు పోటీ పడాలని హితవు పలికారు.

### డీఎస్సీ నియామకాలు అత్యంత పారదర్శకం.. ఆరోపణలపై ఫైర్

డీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీకి తెలుగుదేశం పార్టీ ఒక బ్రాండ్ అని చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకంతో పారదర్శకంగా నియామకాలు చేపట్టామని గుర్తుచేశారు. డీఎస్సీ నియామకాలపై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ, స్పోర్ట్స్ కోటాపై కనీస అవగాహన లేకుండా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే కేటగిరీలు నిర్ణయించి ఉద్యోగాలు ఇచ్చాం అని వివరించారు. కొందరు తమ పేటీఎం బ్యాచ్‌ల ద్వారా ప్రభుత్వంపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బాధ్యత కలిగిన రాజకీయ పార్టీలు ఏ అంశంపైనైనా మాట్లాడే ముందు అధ్యయనం చేయాలని సూచించారు.

### యోగాంధ్ర బడ్జెట్‌పై విమర్శలు తగవు

రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమం కోసం రూ.10 కోట్లు కేటాయిస్తే దానిపైనా ప్రతిపక్షాలు విమర్శలు చేయడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏ నిర్మాణాత్మక నిర్ణయం తీసుకున్నా బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించాలంటే యోగాంధ్ర చాలా ముఖ్యమని, జీవన విధానంలో యోగాను భాగం చేసేందుకు యోగాంధ్రను ఏటా జరపాలని నిర్ణయించామని సీఎం తెలిపారు.

### ఈ ఏడాది థీమ్ యోగా ఫర్ హెల్తీ ఏజ్

ఈ ఏడాది యోగా దినోత్సవానికి యోగా ఫర్ హెల్తీ ఏజ్ అనే థీమ్‌ను పాటిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. వృద్ధాప్యంలోనూ ప్రజలు ఆరోగ్యంగా జీవించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో 'సంజీవని' పథకంతో యోగాను అనుసంధానం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

### జూన్ 7 నుండి 14 రోజుల పాటు యోగా ఉత్సవాలు.. కోటి మంది లక్ష్యం

ఈ నెల 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 14 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా యోగా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. ఈ మహా యజ్ఞంలో ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలు అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి జిల్లా, మండల కేంద్రంతో పాటు వీలైనన్ని ఎక్కువ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యోగాంధ్ర 2026లో కనీసం కోటి మంది పాల్గొనేలా రికార్డు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, అలాగే 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేయడమే ధ్యేయమని పేర్కొన్నారు.

### ఈసారి కృష్ణానది తీరంలో

గతేడాది యోగా కార్యక్రమాలతో ఏపీ అనేక రికార్డులు సాధించిందని, ప్రపంచమంతా మన వైపు చూసేలా చేయగలిగామని చంద్రబాబు గుర్తుచేశారు. గతేడాది విశాఖపట్నం బీచ్ పక్కన రోడ్డుపై యోగా చేశాం. ఈసారి అమరావతిలోని కృష్ణా నది వెస్ట్ బైపాస్ రోడ్డుపై భారీ ఎత్తున యోగా నిర్వహిస్తాం. దీనివల్ల అమరావతి నగర సౌందర్యాన్ని, విశిష్టతను ప్రపంచానికి చూపించే అద్భుత అవకాశం లభిస్తుంది అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

సహాయం కోసం కాల్ సెంటర్

21 రకాల వ్యాధులకు ఉపశమనం కలిగించేలా యోగాసనాలకు సంబంధించిన ప్రత్యేక వీడియోలు సోషల్ మీడియాలో ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. యోగాంధ్ర కార్యక్రమంపై సమగ్ర సమాచారం తెలుసుకోవడానికి మరియు సందేహాల నివృత్తి కోసం ప్రత్యేకంగా 8142404888 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

శ్వేత

సంపాదకీయం

గురువారం 4-6-2026

# మమతా బెనర్జీ కోటకు బీటలు!

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి.లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ధి చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమత మవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది.

దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరఫున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరఫున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది.తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగుడుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుం టున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు దిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధజకారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరువేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు. మమతను ప్రజలే ఛీత్కరించుకునే స్థాయికి వచ్చింది.

# ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయవచ్చు

మొదటి పేజీ తరువాయి

యాభై ఎనిమిది రోజులు నిరాహార దీక్ష చేయడం ప్రాంతీయవాదం కాదా అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి మోదీ తన ప్రాంతం మీది అభిమానంతో తెలంగాణకు వస్తున్న పరిశ్రమలను గుజరాత్‌కు తరలించుకుపోవడం ఆర్థిక ప్రాంతీయవాదం కాదా అని నిలదీశారు. జాతీయవాదం ముసుగులో చేస్తున్న ఈ విధానాలపై పవన్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

### మా ఓజీ కేసీఆరే

పవన్ కల్యాణ్‌ను ఒక నటుడిగా అభిమానిస్తామని మరియు ఏపీ ఉప ముఖ్యమంత్రిగా కచ్చితంగా గౌరవిస్తామని కేటీఆర్ తెలిపారు. ఆయన సోదరుడిలా ఇంటికి వస్తే హైదరాబాదీ బిర్యానీ పెడతామని, కానీ సెక్రటేరియట్‌కు వచ్చి పెత్తనం చేస్తామంటే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. పవన్ కల్యాణ్ ఇటీవల ఓజీ అనే సినిమా తీశారని, కానీ తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి తమకు అసలైన ఓజీగా కేసీఆర్ ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్ర రక్షణకు ఆయన ఒక్కరు చాలని స్పష్టం చేశారు.

### దేశభక్తి పాఠాలు వద్దు

కొద్ది రోజులైతే తెలంగాణలో జాతీయగీతం కూడా పాడరన్న పవన్ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఈ నేలకు ఉందని, దేశాన్ని గౌరవించే సంస్కృతి ఇక్కడి ప్రజలకు ఉందని వివరించారు. దేశభక్తి గురించి పవన్ తమకు కొత్తగా పాఠాలు నేర్పాల్సిన పనిలేదని ఘాటుగా బదులిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఎవరికో అనాయాసంగా రాలేదని, వేలాది మంది రక్తంతో తడిసిన నేల అని ఆయన గుర్తుచేశారు.

### పోటీని ఎవరు అడ్డుకున్నారు

ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పార్టీ పెట్టి పోటీ చేయవచ్చని, అది రాజ్యాంగం కల్పించిన హక్కు అని కేటీఆర్ తెలిపారు. జనసేన సైతం గత అసెంబ్లీ మరియు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిందని, అప్పుడు ఎవరూ అడ్డుకోలేదని గుర్తుచేశారు. ఒక ప్రాంతంలో పోటీ చేసేటప్పుడు అక్కడి ప్రజల ఆకాంక్షలు మరియు త్యాగాలను కచ్చితంగా గుర్తించాలని సూచించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు సభ పెట్టుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుందని, ఆ విషయాన్ని పవన్ వారిని నిలదీయాలి తప్ప ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని కేటీఆర్ సూచించారు.

# తెలంగాణ-జర్మనీ మధ్య బంధం

## సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సహకారానికి ఒప్పందం



### హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు జర్మనీ బృందం ఆసక్తి

### సీఎం రేవంత్, మంత్రి వివేక్ సమక్షంలో ఒప్పందం

హైదరాబాద్, జూన్ 3: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, జర్మనీకి చెందిన థూరింగియా రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకారం కోసం కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. భారత్ పర్యటనలో భాగంగా థూరింగియా రాష్ట్ర మినిస్టర్ ప్రెసిడెంట్ మారియో ఫోకట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల మధ్య పారిశ్రామిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే కీలక పత్రాలపై సంతకాలు చేశారు. దేశంలోనే అభివృద్ధి, ఆవిష్కరణలకు తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోందని ఈ సందర్భంగా జర్మనీ ప్రతినిధులు కొనియాడారు.

### గ్లోబల్ నైపుణ్యాలపై ఫోకస్

కృత్రిమ మేధస్సు యుగంలో మారుతున్న అంతర్జాతీయ ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాల్సిన ఆవశ్యకత ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల అవసరాలను తీర్చగల విధంగా మన స్కిల్లింగ్ కార్యక్రమాలను పునర్నిర్మించాల న్నారు. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్స్ యూ నివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు మరియు పాలిటెక్నిక్ విద్యాసంస్థల పాఠ్యాంశాలను ఆధునీకరించడంలో థూరింగియా సహకారం అందించాలని సీఎం కోరారు.

జర్మనీ పరిశ్రమలకు భవిష్యత్తులో అవసరమయ్యే మానవ వనరులను అందించేందుకు థూరింగియా రాష్ట్ర సహకారంతో హైదరాబాద్‌లో ఒక ప్రత్యేక జర్మన్ భాషా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. సిలికాన్ వ్యాలీ వంటి అంతర్జాతీయ టెక్నాలజీ కేంద్రాల్లో తెలంగాణకు చెందిన నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. కృత్రిమ మేధస్సు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విదేశీ భాషల్లో శిక్షణతో పాటు నైపుణ్యాల పెంపొందింపులో సమగ్ర మార్పులు తీసుకురావడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

### సెమీకండక్టర్ కంపెనీల రాక

జర్మనీకి చెందిన ప్రముఖ సెమీకండక్ట ర్ కంపెనీల ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని త్వరలోనే తెలంగాణకు అధికారికంగా తీసుకొచ్చి పెట్టుబడి అవకాశాలను పరిశీలింపజేస్తామని మారియో ఫోకట్ ప్రతిపాదించారు. తెలంగాణ పరిశ్రమల అవసరాలను తీర్చడంలో థూరింగియా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి స్వాగతించారు. తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ ద్వారా జర్మన్ భాషలో శిక్షణ, విదేశీ ఉపాధి అవకాశాల కల్పనలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నామని వారు వివరించారు.

### ఫ్యూచర్ సిటీపై ప్రశంసలు

భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి పెట్టుబడులు మరియు ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యంగా ఫార్చ్యూన్ ఐదు వందల కంపెనీలను ఆకర్షించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడులకు అనుకూల వాతావరణంపై జర్మనీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావుతో పాటు జర్మనీ రక్షణ, ఏరోస్పేస్, లైఫ్ సైన్సెస్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# దిల్లీలో ఘోర అగ్నిప్రమాదం.. 21 మంది సజీవ దహనం!

మొదటి పేజీ తరువాయి

కింద నడుస్తున్న ఈ హోటల్‌లో ఉదయం 8.50 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాద తీవ్రతకు తొలుత చిన్నగా మొదలైన మంటలు క్షణాల వ్యవధిలోనే భవనం అంతటా వేగంగా వ్యాపించడంతో లోపల ఉన్న అతిథులు బయటకు వచ్చే మార్గం లేక ఊపిరాడక, మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ఈ హోటల్‌లో పనిచేసే చెఫ్ కేసర్ సింగ్ తాను ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయడానికి ప్రయత్నించినప్పుడు ఒక్కసారిగా మంటలు చెలరేగాయని, వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసినప్పటికీ అప్పటికే హోటల్ మొత్తం మంటల్లో చిక్కుకుందని వెల్లడించారు. ఈ ప్రమాదంలో మరణించిన విదేశీయులంతా సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా దేశాల నుంచి దిల్లీకి వైద్య చికిత్స కోసం వచ్చి ఇక్కడ బస చేసినట్లు అధికారులు ప్రాథమికంగా ధృవీకరించారు. అయితే, ఈ హోటల్‌లో అనుమతించిన పరిమితికి మించి విపరీతంగా అతిథులకు వసతి సౌకర్యాలు కల్పించడమే ఇంతటి భారీ ప్రాణనష్టానికి ప్రధాన కారణమని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఈ భయానక ప్రమాద సమయంలో స్థానిక ప్రజలు చూపిన సమయస్ఫూర్తి, సాహసం పలువురి ప్రాణాలను కాపాడాయి. హోటల్ పై అంతస్తుల్లో చిక్కుకున్న వారు ప్రాణభయంతో కిందికి దూకుతున్న సమయాల్లో.. వారికి ఎలాంటి దెబ్బలు తగలకుండా ఉండేందుకు స్థానికులు రోడ్డుపై పరుపులు పరిచారు. ఈ క్రమంలోనే దట్టమైన పొగలు, మంటల నడుమ చిక్కుకున్న ఒక మహిళ తన చిన్నారిని గుండెలకు హత్తుకుని మూడో అంతస్తు నుంచి కిందకు దూకేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి అందరినీ కన్నీరు పెట్టించాయి. సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, అత్యవసర రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘోర దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. కేంద్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ.2 శ్రీఘ్నెష్ట్ర, అలాగే గాయపడిన వారికి మెరుగైన చికిత్స నిమిత్తం రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ బాధితులకు అన్ని రకాల తక్షణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# పెట్టుబడులకు పూర్తి సహకారం

## దక్షిణాఫ్రికా పారిశ్రామిక వేత్తలకు సీఎం రేవంత్ భరోసా

### రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి సంపూర్ణ సహకారం

### డిప్యూటీ ప్రెసిడెంట్ పాల్ మషటైల్ బృందంతో సీఎం భేటీ

### తెలంగాణలో అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై చర్చ

### గ్రీన్ ఎనర్జీ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు అవకాశం

### దక్షిణాఫ్రికా కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం.





**హైదరాబాద్, జూన్ 3:** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపించే దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు అవసరమైన పూర్తి సహకారం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ ప్రాంగణంలో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ పాలస్ షిపొకోసా మషటైల్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా భేటీ అయింది. ఈ సందర్భంగా తెలంగాణ మరియు దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే కీలక అంశాలపై ఇరువర్గాలు విస్తృతంగా చర్చించాయి.

**అపార అవకాశాలు ప్రోత్సాహకాలు**

భారత్‌లో అధికారిక పర్యటనలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన మషటైల్ బృందానికి ముఖ్యమంత్రి ప్రత్యేక స్వాగతం పలికారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను మరియు తమ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న ప్రత్యేక ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి ఈ సమావేశంలో ప్రతినిధి బృందానికి సమగ్రంగా వివరించారు. ఈ అత్యున్నత స్థాయి భేటీలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**తెలంగాణ వృద్ధి అభినందనీయం**

రాష్ట్రంలో తమకు ఆత్మీయ స్వాగతం పలికినందుకు దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూనే, అతి తక్కువ కాలంలో జాతీయ స్థూల దేశీయోత్పత్తికి తెలంగాణ అత్యధికంగా తోడ్పడుతుండటం అభినందనీయమని కొనియాడారు. తెలంగాణ ప్రజల పట్టుదల మరియు సృజనాత్మకతకు ఈ విజయాలే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పర్యటన ద్వారా శాస్త్రీయ సాంకేతిక మరియు పెట్టుబడి రంగాల్లో మరింత విస్తృత భాగస్వామ్యాన్ని ఆశిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

**ఆయా రంగాల్లో అగ్రగామి**

భారత్ మరియు దక్షిణాఫ్రికా మధ్య ఉన్న చారిత్రక సంబంధాలను మంత్రి శ్రీధర్ బాబు సమావేశంలో గుర్తుచేశారు. సాంకేతికత, ఔషధ రంగం, వ్యాక్సిన్లు, రక్షణ, ఏరోస్పేస్, పరిశోధన మరియు మౌలిక సదుపాయాల రంగాల్లో తెలంగాణ విశిష్ట ప్రతిభ కనబరుస్తోందని వివరించారు. గ్రీన్ ఎనర్జీ మరియు సుస్థిర అభి వృద్ధి రంగాలలో రాష్ట్రం అత్యంత వేగంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. ద్వైపా క్షిక సంబంధాలను మరింత మెరుగు పరిచేందుకు తెలంగాణలో పెట్టుబడి అవ కాశాలను నిశితంగా పరిశీలించాలని దక్షిణా ఫ్రికా కం పెనీలను ఆయన ప్రత్యేకంగా ఆహ్వానించారు.

## టీఎన్ఎస్ఎఫ్ పశ్చిమ నియోజకవర్గ నూతన కార్యవర్గం ప్రకటన

### ఎంపీ కేశినేని చిన్ని అభినందనలు

**విజయవాడ, జూన్ 03:** విద్యార్థులకు, యువతకు మరియు పార్టీ అధిష్ఠానానికి మధ్య వారధిగా టీఎన్ఎస్ఎఫ్ నిలవాలని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపునిచ్చారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు మంగళవారం ఎంపీ చిన్నిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారమే ముఖ్య ఉద్దేశంగా నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ నూతన కమిటీలో టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శిగా చరణ్ సాయి యాదవ్, పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులుగా మోది వెంకటరాజు, మరియు కార్యదర్శిగా రౌతుల మణికంఠ ఎంపికయ్యారు. విద్యార్థి లోకం ఎదుర్కొంటున్న సమస్యలపై టీఎన్ఎస్ఎఫ్ ఎల్లప్పుడూ పోరాడుతూ, వారికి అండగా నిలవాలని ఈ సందర్భంగా ఎంపీ చిన్ని ఆకాంక్షించారు.



## కివీస్ గడ్డపై టీమ్‌ఇండియా సుదీర్ఘ పర్యటన

### 40 రోజుల పాటు 5 టీ20లు, 5 వన్డేలు, 2 టెస్టుల సిరీస్

### న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద పర్యటన

### ఇరు దేశాల వందేళ్ల క్రీడా బంధానికి ప్రతీకగా సిరీస్

**న్యూఢిల్లీ, జూన్ 3:** టీమ్‌ఇండియా అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1 వరకు న్యూజిలాండ్‌లో సుదీర్ఘ పర్యటన చేపట్టనుంది. మొత్తంగా 40 రోజుల పాటు సాగే ఈ ప్రతిష్ఠాత్మక పర్యటనలో ఇరు జట్లు 5 టీ20లు, 5 వన్డేలు, మరియు 2 టెస్ట్ మ్యాచ్‌లలో తలపడనున్నాయి. న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలోనే ఏ విదేశీ జట్టు కూడా ఒకే పర్యటనలో ఇన్ని మ్యాచ్‌లు ఆడకపోవడంతో, ఇది ఆ దేశ చరిత్రలోనే అతిపెద్ద పర్యటనగా రికార్డు సృష్టించనుంది. అంతేకాకుండా, ఈ సిరీస్ భారత్-న్యూజిలాండ్ దేశాల మధ్య నెలకొన్న వందేళ్ల సుదీర్ఘ క్రీడా సంబంధాలకు ఒక సముచిత ప్రతీకగా నిలవనుంది. భారత్ చివరిసారిగా 2019-20 సీజన్‌లో న్యూజిలాండ్‌లో పర్యటించగా, ఆ తర్వాత కివీస్ జట్టు రెండుసార్లు భారత్‌లో పర్యటించింది. ముఖ్యంగా గత 2024-25 టూర్‌లో కివీస్ జట్టు భారత్‌ను భారత్‌లోనే 3-0 తేడాతో టెస్ట్ సిరీస్‌లో క్లీన్ స్వీప్ చేసిన నేపథ్యంలో, ఈ సుదీర్ఘ పర్యటన అభిమానులకు అసలైన వినోదాన్ని పంచనుంది. ఈ ప్రతిష్ఠాత్మక పర్యటనకు సంబంధించిన పూర్తి మ్యాచ్‌ల షెడ్యూల్ వివరాలు:

భారత్ - న్యూజిలాండ్ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్:


టీ20 సిరీస్ (అక్టోబర్ 22 నుంచి నవంబర్ 1):
మొదటి టీ20: అక్టోబర్ 22 -- క్రైస్ట్‌చర్చ్
రెండో టీ20: అక్టోబర్ 24 -- క్రైస్ట్‌చర్చ్
మూడో టీ20: అక్టోబర్ 27 -- వెల్లింగ్టన్
నాలుగో టీ20: అక్టోబర్ 30 -- ఆక్లాండ్
అయిదో టీ20: నవంబర్ 1 -- హామిల్టన్

వన్డే సిరీస్ (నవంబర్ 4 నుంచి నవంబర్ 15):
తొలి వన్డే: నవంబర్ 4 -- ఆక్లాండ్
రెండో వన్డే: నవంబర్ 7 -- వెల్లింగ్టన్
మూడో వన్డే: నవంబర్ 10 -- హామిల్టన్
నాలుగో వన్డే: నవంబర్ 13 -- మౌంట్ మాంగనూయి
అయిదో వన్డే: నవంబర్ 15 -- మౌంట్ మాంగనూయి

టెస్ట్ సిరీస్ (నవంబర్ 19 నుంచి డిసెంబర్ 1):
మొదటి టెస్ట్: నవంబర్ 19 నుంచి 23 వరకు -- వెల్లింగ్టన్
రెండో టెస్ట్: నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు -- క్రైస్ట్‌చర్చ్

## తోతపూరి మామిడి రైతులకు ప్రభుత్వం అండ: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, జూన్ 03:** తోతపూరి మామిడి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు న్యాయమైన ధర లభించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



బుధవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుండి పల్ప్ పరిశ్రమలు, బాట్లింగ్ కంపెనీలు మరియు ఉన్నతాధికారులతో నిర్వహించిన వర్చువల్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారుల ప్రమేయం లేకుండా ప్రాసెసింగ్ యూనిట్లు నేరుగా రైతుల నుంచే పండ్లను కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశించారు. మార్కెట్‌పై ఒత్తిడి పడకుండా ఉండేందుకు దశలవారీగా కోతలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, తమిళనాడులోని కృష్ణగిరి మార్కెట్‌లో తక్కువ ధరలు నమోదవుతున్న అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తోందని, పొరుగు రాష్ట్రాల అధికారులతో చర్చించి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సమాన ధరల విధానం అమలుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. చివరి పండు వరకు నాణ్యమైన ప్రతి కాయను కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. మరోవైపు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ ఏడాది ప్రతికూల వాతావరణం వల్ల 25 నుంచి 30 శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, సుమారు 7.80 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదవుతుందని ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు వివరించారు. ప్రస్తుతం జిల్లాలోని 44 ప్రాసెసింగ్ యూనిట్లలో 37 యూనిట్లు ఈ సీజన్‌లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాయని, మార్కెట్‌లో తోటపూరి ధర కిలోకు రూ.7 నుండి రూ.7.50 మధ్య కొనసాగుతోందని పేర్కొన్నారు. ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ, కేవలం పల్ప్‌కే పరిమితం కాకుండా మామిడి వ్యర్థాల నిర్వహణ, విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలని, ఇందుకోసం మైసూర్ సీఎఫ్‌టీఆర్ఐ సహకారంతో వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు. గత ఏడాది నిల్వలు భారీగా ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాల దృష్ట్యా ముందస్తు ప్రణాళికలతో ఎక్కువ రోజులు కొనుగోళ్లు జరిపి రైతులకు అండగా నిలుస్తామని పల్ప్ పరిశ్రమల ప్రతినిధులు మంత్రికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల డైరెక్టర్లు, ప్రముఖ పానీయాల సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అమరావతిని గ్లోబల్ హెల్త్ హబ్ గా తీర్చిదిద్దుతాం





### గుంటూరులో లలితా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు



**గుంటూరు, జూన్ 03:** రాజధాని అమరావతిని గ్లోబల్ హెల్త్ హబ్ తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గుంటూరులో 600 పడకలు, 32 విభాగాలతో అత్యాధునిక వసతులతో నూతనంగా ఏర్పాటు చేసిన లలిత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గతంలో హైదరాబాద్‌లో హెల్త్ టూరిజాన్ని ప్రోత్సహించిన విధంగానే రాబోయే రోజుల్లో ప్రపంచ నలుమూలల నుంచి రోగులు అమరావతికి వచ్చి చికిత్స పొందేలా మౌలిక వసతులు కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా అత్యాధునిక ఎమ్ఆర్ఐ స్కాన్‌ను ఇక్కడ అందుబాటులోకి తేవడం అభినందనీయమన్న ఆయన.. దశాబ్దాలుగా వైద్య రంగంలో నమ్మకమైన బ్రాండ్‌గా నిలిచిన లలితా గ్రూప్ విలువలను కొనియాడారు. ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు 'సంజీవని' ప్రాజెక్టును తీసుకొచ్చామని, దీని ద్వారా ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులను భద్రపరుస్తామని తెలిపారు. వ్యాధి రాకముందే గుర్తించడం, నివారించడం, వచ్చాక నయం చేయడం అనే త్రిముఖ వ్యూహంతో పనిచేస్తూ.. ప్రజల ఇంటి వద్దకే వచ్చి 42 రకాల వైద్య పరీక్షలు చేస్తామని వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'ని అమలు చేసి, ప్రతి కుటుంబానికి రూ.2.5 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, ఆరోగ్యకరమైన పౌరులే సంపన్న దేశాన్ని నిర్మిస్తారని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని వసతులు కల్పించినా ప్రజల జీవనశైలిలో మార్పు రానంత వరకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ మంచి ఆహారం, వ్యాయామం, యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. మన వంటిల్లే మన ఫార్మసీ అని, అయితే ప్రస్తుత కాలంలో రసాయనిక ఎరువుల వాడకం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఇదే సమయంలో గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. గత హయాంలో నాసిరకం మద్యం విక్రయించి ప్రజల ఆరోగ్యంతో తీవ్రంగా చెలగాటమాడారని ముఖ్యమంత్రి మండిపడ్డారు.




## ఏపీ కేవలం పర్యాటక ప్రాంతం కాదు..

## అదొక మరపురాని అనుభూతి

### కేరళంలో మంత్రి కందుల దుర్గేష్

**తిరువనంతపురం, జూన్ 03:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేవలం పర్యాటక ప్రాంతం మాత్రమే కాదని, అదొక మరపురాని అనుభూతి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో ప్రారంభమైన ప్రతిష్ఠాత్మక గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ 2026 సదస్సులో ఆయన పాల్గొని కీలక ప్రసంగం చేశారు. దేశ పర్యాటక రంగంలో ఏపీ అత్యంత వేగంగా ఎదుగుతోందని కొనియాడుతూ, రాష్ట్రానికి ప్రకటించిన ప్రతిష్ఠాత్మక బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్ అవార్డును నేడు కోవాలంలో జరిగే వేడుకలో దేశవిదేశాల ప్రముఖుల సమక్షంలో తాను అందుకోనున్నట్లు మంత్రి వెల్లడించారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 36.42 కోట్ల పర్యాటక సందర్శనలతో ఏపీ సరికొత్త రికార్డు సృష్టించిందని, అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్యలో 48 శాతం వృద్ధి నమోదైందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పర్యాటక విధానం 2024-29 ద్వారా సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని మంత్రి తెలిపారు. స్టాప్‌ఓవర్ టూరిజం నుండి పర్యాటకులు ఎక్కువ రోజులు గడిపేలా ఎక్స్‌పీరియెన్షియల్ టూరిజం వైపు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని, ఇందులో భాగంగా 7 యాంకర్ హబ్‌లు, 25 థీమాటిక్ సర్క్యూట్లను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలు, 1,054 కి.మీ. సుదీర్ఘ తీరప్రాంతం, అరకు, లంబసింగి, గండికోట వంటి చారిత్రక, ప్రకృతి రమణీయ ప్రాంతాలు ఏపీ సొంతమని వివరించారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెబుతూ, పర్యాటక రంగ పెట్టుబడిదారులు, టూర్ ఆపరేటర్లు ఏపీలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి సాదరంగా ఆహ్వానించారు.

# రష్యాలో మంత్రి నారా లోకేష్ పర్యటన








### ఏపీని ఏఐ డడీప్ టెక్ హబ్ గా మార్చేలా స్బేర్‌బ్యాంక్‌తో కీలక చర్చలు

**ఇంటర్నెట్ డెస్క్, జూన్ 03:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డీప్ టెక్నాలజీలకు ప్రపంచస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యాలో కీలక పర్యటన చేపట్టారు. మాస్కోలో ఆ దేశ ప్రభుత్వ నియంత్రణలోని అతిపెద్ద రిటైల్ బ్యాంకింగ్, సాంకేతిక దిగ్గజ సంస్థ స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారతదేశంలోని బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు స్బేర్‌బ్యాంక్ సొంతంగా అభివృద్ధి చేసిన గిగాచాట్ ఎల్ఎల్ఎం సాంకేతికతను విస్తరించే అవకాశాలపై ఇరుపక్షాల మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. పాశ్చాత్య దేశాల ప్లాట్‌ఫారమ్‌లకు ఇది ఒక సురక్షితమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని మంత్రి లోకేష్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. భారత్‌లో డిజిటల్ భద్రత, స్మార్ట్ సిటీ మౌలిక సదుపాయాల బలోపేతమే ధ్యేయంగా మంత్రి లోకేష్ పలు వినూత్న ప్రతిపాదనలను స్బేర్‌బ్యాంక్ ప్రతినిధుల ముందుంచారు. దేశంలోని యూపీఐ నెట్‌వర్క్ భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు, స్బేర్‌బ్యాంక్‌కు చెందిన అత్యాధునిక వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్ సాంకేతికతను భారత బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించాలని కోరారు. అలాగే, దేశవ్యాప్తంగా సాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా మున్సిపల్ కార్యకలాపాల నిర్వహణకు ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్ వంటి డిజిటల్ పరిష్కారాలను అందించాలని సూచించారు. ప్రపంచస్థాయి ఏఐ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను వేగంగా తీర్చిదిద్దేందుకు వీలుగా స్బేర్‌బ్యాంక్ యొక్క ప్రసిద్ధ స్కూల్ 21 కోడింగ్ అకాడమీలను భారత్‌లోని ప్రధాన విద్యా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా, వేగంగా వృద్ధి చెందుతున్న విశాఖపట్నంలోని ఫార్మా, వ్యవసాయ ఎగుమతి దారుల ప్రయోజనాల కోసం రూపాయి-రూబుల్ వాణిజ్యానికి అనుమతులతో పాటు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం భారత్‌లోని న్యూఢిల్లీ, ముంబై శాఖల ద్వారా ద్వైపాక్షిక వాణిజ్య ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని, అలాగే బెంగళూరులోని తమ ఐటీ హబ్ ద్వారా రూపాయి-రూబుల్ వాణిజ్య లావాదేవీలను సమన్వయం చేస్తున్నామని ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన సాంకేతిక, ఆర్థిక భాగస్వామ్య అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, ప్రపంచవ్యాప్తంగా 11 కోట్లకు పైగా రిటైల్ ఖాతాదారులు, 12 వేల శాఖలతో కేవలం బ్యాంకింగ్ రంగంలోనే కాకుండా క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో అంతర్జాతీయంగా స్బేర్‌బ్యాంక్ అగ్రగామిగా కొనసాగుతోంది.

# డీఎస్సీ--2025పై సీబీఐ విచారణ జరపాలి

### వైఎస్ జగన్ డిమాండ్

### తాడేపల్లిలో జగన్ ను కలిసిన డీఎస్సీ అభ్యర్థులు

### అభ్యర్థులకు అండగా ఉంటామని హామీ

### న్యాయపోరాట ఖర్చులన్నీ భరిస్తామని వైఎస్ జగన్ హామీ






**తాడేపల్లి, జూన్ 03:** కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ--2025లో అంతులేని అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని, దీనిపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన డీఎస్సీ అభ్యర్థులు ఆయనను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వన్ ఈజ్ టు వన్ నిష్పత్తిలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచి, అన్ని అర్హతలూ ఉన్నా తమకు ఉద్యోగాలు ఇవ్వకుండా అన్యాయం చేశారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల బాధలను సావధానంగా విన్న వైఎస్ జగన్.. అభ్యర్థులు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని, వైఎస్సార్‌సీపీ మీకు ప్రతి అడుగులోనూ అండగా, తోడుగా ఉంటుందని కొండంత భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. డీఎస్సీ--2025 ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని, ఇష్టారాజ్యంగా జీఓలు జారీ చేస్తూ ఉద్యోగాలు అమ్ముకున్నారనే ఆరోపణలు వస్తున్నాయని మండిపడ్డారు. తమ హయాంలో 2019లో కేవలం ఆరు నెలల్లోపే ఎక్కడా ఎలాంటి వివాదాలకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా 1.30 లక్షల సచివాలయ ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తుచేశారు. కానీ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కేవలం 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీలోనే ఇన్ని అక్రమాలకు తెరలేపడం అత్యంత హేయమైన చర్య అని ఆక్షేపించారు. పేపర్ల లీకేజీ దగ్గర నుంచి, మెరిట్ జాబితాలో కింద ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడం, జిల్లా ఫస్ట్ ర్యాంకర్ వెరిఫికేషన్‌కు రాలేదంటూ కోర్టుకెళ్లేలా చేయడం వంటి ఎన్నో ఘోరాలు ఈ డీఎస్సీలో జరిగాయని దుయ్యబట్టారు. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా పేరిట చంద్రబాబు ప్రభుత్వం పెద్ద దగాకు పాల్పడిందని వైఎస్ జగన్ ఆరోపించారు. ఎలాంటి పరీక్షలు అవసరం లేదు, కేవలం సర్టిఫికెట్ల ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తామంటూ మొదట ఒక జీఓ తెచ్చి, అర్హత లేని తమ సొంత వాళ్లకు, టెట్ క్వాలిఫై కాని వారికి కూడా అడ్డదారిలో పోస్టింగులు ఇచ్చుకున్నారని విమర్శించారు. తీరా వారి పని పూర్తి కాగానే.. ఆ గేట్లు మూసేసి, స్పోర్ట్స్ కోటాకు కూడా పరీక్ష, ఇతర అర్హతలు తప్పనిసరి అంటూ నిబంధనలు మారుస్తూ మరో కొత్త జీఓను తీసుకురావడం దారుణమన్నారు. 1:1 పద్ధతిలో ఇంటర్వ్యూలకు పిలిచి కూడా అర్హులైన నిరుద్యోగులను రిజెక్ట్ చేయడం వెనుక పెద్ద డార్క్ ఆపరేషన్ నడిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత అభ్యర్థుల తరపున వైఎస్సార్‌సీపీ నుంచి గట్టిగా న్యాయపోరాటం చేస్తామని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక లీగల్ ప్యానెల్ ను ఏర్పాటు చేస్తున్నామని వైఎస్ జగన్ ప్రకటించారు. కోర్టు పోరాటానికి అయ్యే ఖర్చంతా పార్టీయే భరిస్తుందని, తమ ఇద్దరు టీచర్ ఎమ్మెల్సీలు, విద్యార్థి విభాగం కూడా అభ్యర్థులకు తోడుగా ఉంటారని తెలిపారు. దేవుడి దయతో మూడేళ్ల తర్వాత మన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని.. రాగానే డీఎస్సీ--2025 అక్రమాలపై ప్రత్యేక విచారణ కమిషన్ వేస్తామని హామీ ఇచ్చారు. నాడు 1998 డీఎస్సీ బాధితులకు తమ ప్రభుత్వంలో న్యాయం చేసినట్లే.. ఈ డీఎస్సీ--2025 బాధితులకు కూడా పూర్తి న్యాయం చేస్తామని, అవసరమైతే వీరి కోసం ప్రత్యేకంగా అదనపు పోస్టులను క్రియేట్ చేసి ఉద్యోగాలు ఇస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారు.



## మాజీ సీఐ చిన్నమల్లయ్య ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జూన్ 03:** మహిళపై లైంగిక దాడికి పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న పల్నాడు జిల్లా వినుకొండ మాజీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) చిన్నమల్లయ్యకు సుప్రీంకోర్టులో గట్టి చుక్కెదురైంది. బాధితురాలి ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి పాల్పడటమే కాకుండా చంపుతానని బెదిరించారనే ఫిర్యాదుపై నమోదైన ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం.. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ ఘటనపై గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఇప్పటికే చిన్నమల్లయ్యపై సస్పెన్షన్ వేటు వేయగా, కేసు నమోదైనప్పటి నుండి పరారీలో ఉన్న ఆయన కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా గాలిస్తున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు సైతం బెయిల్‌ను నిరాకరించడంతో మాజీ సీఐ అరెస్టుకు మార్గం సుగమమవగా, పోలీసుల తదుపరి చర్యలపై జిల్లావ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మరోవైపు అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న సీఐ చిన్న మల్లయ్యను ఉద్యోగం నుంచి పోలీసుశాఖ డిస్మిస్ చేసింది. శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు.



## సముద్ర గర్భంలో వినూత్న అండర్‌వాటర్ సైక్లింగ్ ప్రదర్శన

**విశాఖపట్నం, జూన్ 03:** వరల్డ్ బైసికిల్ డే సందర్భంగా ఫిట్‌నెస్, పర్యావరణ పరిరక్షణ మరియు ఇంధన పొదుపును ప్రోత్సహిస్తూ విశాఖపట్నం సముద్ర జలాల్లో వినూత్న అండర్‌వాటర్ సైక్లింగ్ ప్రదర్శన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, లైవ్‌ఇన్ అడ్వెంచర్స్ స్కూబా డైవింగ్ అకాడమీ వ్యవస్థాపకుడు బి. బాలరాం నాయుడు ఆధ్వర్యంలో నలుగురు స్కూబా డైవర్ల బృందం పూర్తి పరికరాలు ధరించి సముద్ర గర్భంలో సైక్లింగ్ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా బాలరాం నాయుడు మాట్లాడుతూ.. సైక్లింగ్ వల్ల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతో తోడ్పడుతుందని, పర్యావరణ హితమైన రవాణా సాధనంగా ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో సైక్లింగ్‌ను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం తగ్గిపోతున్న బైసికిల్ క్లబ్‌ల కార్యకలాపాలను మరింత బలోపేతం చేసి యువతను సైక్లింగ్ వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

### డిప్యూటీ సీఎంగా జి. పరమేశ్వర, మంత్రులుగా ప్రియాంక్ ఖర్గే, యతీంద్ర సహా 12 మంది ప్రమాణం


### హాజరైన రాహుల్ గాంధీ, ఖర్గే, రేవంత్ రెడ్డి

**బెంగళూరు, జూన్ 3:** కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ బలమైన నేత డీకే శివకుమార్ బుధవారం వైభవంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. లోక్‌భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఈ వేడుకలో రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఆయనతో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు. ఎంతో భావోద్వేగంతో సాగిన ఈ కార్యక్రమంలో డీకే శివకుమార్ భారత రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి ప్రమాణం చేయడం అందరినీ ఆకట్టుకుంది. అంతకుముందు ఆయన వేదికపైకి రాగానే అక్కడకు తరలివచ్చిన ప్రజలకు, అభిమానులకు సాష్టాంగ నమస్కారం చేసి తన కృతజ్ఞతను చాటుకున్నారు. ఇదే వేదికపై తన సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను డీకే శివకుమార్ శాలువాతో ఘనంగా సత్కరించి పెద్దల పట్ల గౌరవాన్ని ప్రకటించారు. ఈ చారిత్రాత్మక వేడుకకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీలతో పాటు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి, కేరళ సీఎం వీడీ సతీశన్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు మరియు ఇతర ఏఐసీసీ ముఖ్య నేతలు భారీగా హాజరయ్యారు. ఈ నూతన ప్రభుత్వంలో సీనియర్ నాయకుడు జి. పరమేశ్వర డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేయగా, వారితో పాటు మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ మంత్రివర్గంలో యువతకు, సీనియార్టీకి సమ ప్రాధాన్యత లభించింది. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, అలాగే కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేలకు ఈ క్యాబినెట్‌లో మంత్రి పదవులు దక్కాయి. వీరితో పాటు కేహెచ్ మునియప్ప, కె.జె.జార్జ్, ఎంబీ పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జర్కిహోళి, కృష్ణబైరె గౌడ, యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌లు నూతన మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. ఈ ఘనమైన ప్రమాణస్వీకార మహోత్సవంతో కర్ణాటకలో సరికొత్త పాలనా అధ్యాయం అధికారికంగా ప్రారంభమైంది.

# డీఎస్సీపై జగన్‌ది విషప్రచారం

### హోంమంత్రి వంగలపూడి అనిత

### తప్పుడు ప్రచారాలు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరిక



**అమరావతి, జూన్ 03:** డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ తొమ్మిది నెలల తర్వాత వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి విషప్రచారం మొదలుపెట్టారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డీఎస్సీపై వైకాపా చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూ ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్నో కుటుంబాలకు ఎమోషనల్ బాండింగ్ లాంటి డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను, ఏ ఒక్క కోర్టు కేసూ అడ్డంకి రాకుండా అన్ని సమస్యలను పరిష్కరించి కూటమి ప్రభుత్వం ఎంతో గౌరవప్రదంగా నియామక పత్రాలను అందజేసిందని గుర్తుచేశారు. ప్రశ్నపత్రాల లీకేజీకి ఎక్కడా అవకాశం లేకపోవడంతోనే వైకాపా నేతలు ఇప్పుడు స్పోర్ట్స్ కోటాపై పడి ఏడుస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిలో అత్యధిక శాతం తెలుగుదేశం ప్రభుత్వంలో నియమితులైన వారేనని, తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే వారిపై కచ్చితంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి అనిత హెచ్చరించారు. గత ప్రభుత్వం 2022లో తీసుకొచ్చిన హారిజాంటల్ రిజర్వేషన్ జీవో ఆధారంగానే ప్రస్తుతం డీఎస్సీ నియామకాలు పూర్తి పారదర్శకంగా జరిగాయని హోంమంత్రి స్పష్టం చేశారు. తమ హయాంలో ఉపాధ్యాయులను తీసుకెళ్లి మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టిన మహామహులు, నేడు బ్రిడ్జ్ స్పోర్ట్స్‌పై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బ్రిడ్జ్ స్పోర్ట్స్ అంటే గొడ్డలి పార్టీ నేతలు నిర్వహించే జూద శిబిరాలు కావని, అది అంతర్జాతీయ గుర్తింపు పొందిన క్రీడ అని మండిపడ్డారు. వైకాపా నేతలకు కేవలం సమస్యలు సృష్టించడమే కావాలి తప్ప, సమాధానాలు వద్దని ధ్వజమెత్తారు. వైసీపీ చేసే ప్రతి విషప్రచారానికి ప్రజలకు అర్థమయ్యేలా తాము గట్టి సమాధానాలు చెబుతామని, తప్పుడు కూతలను కచ్చితంగా కట్టడి చేస్తామని మంత్రి వంగలపూడి అనిత పునరుద్ఘాటించారు.

## రోడ్డు ప్రమాదంలో డ్యాన్స్ మాస్టర్ పండుకు తీవ్ర గాయాలు




**విశాఖపట్నం, జూన్ 03:** ప్రముఖ బుల్లితెర డ్యాన్స్ మాస్టర్ పండు విశాఖపట్నం జిల్లా ఆనందపురం వద్ద అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన రెండు కాళ్లకు బలమైన గాయాలు కాగా, ప్రస్తుతం విశాఖలోని మెడికవర్ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. పండు కాళ్లకు ఆపరేషన్ నిర్వహించాల్సి ఉందని, ఆయన పూర్తిగా కోలుకుని సాధారణ స్థితికి రావడానికి కనీసం ఆరు నెలల పాటు సంపూర్ణ విశ్రాంతి అవసరమని వైద్యులు అధికారిక ప్రకటనలో స్పష్టం చేశారు. కాగా, ఈ ఘటనపై ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా, పండు త్వరగా కోలుకోవాలని బుల్లితెర ప్రముఖులు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# కమ్యూనిజం చచ్చిపోలేదు

### పవన్ మాటలు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నాయన్న ఎమ్మెల్యే కూనంనేని

### జనసేనాని వ్యాఖ్యలను ఖండించిన గద్దర్ కుమార్తె వెన్నెల

**హైదరాబాద్, జూన్ 03:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నాయని తెలంగాణ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఖండించారు. రాజకీయ ప్రయోజనాల కోసం అన్నదమ్ముల్లా ఉండే ప్రజల మధ్య విబేధాలు సృష్టించడం ప్రజాద్రోహమని ఆయన మండిపడ్డారు. కమ్యూనిజం చచ్చిపోయిందన్న





పవన్ వ్యాఖ్యలను తప్పుబడుతూ, గతంలో ఆయన కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకుని, చేగువేరా ఫోటోలు ప్రదర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే, ప్రజాగాయకుడు గద్దర్‌కు కారు ఇచ్చానని ప్రచారం చేసుకోవడం కనీస సంస్కారం కాదన్నారు. ఇదే క్రమంలో ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై ఏపీలో పెట్టిన కేసులను నిరసిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం, ధరల పెరుగుదల మరియు ప్రభుత్వ విధానాలపై నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

**తెలంగాణ మా జాగీరే: గద్దర్ కుమార్తె వెన్నెల**

మరోవైపు పవన్ కల్యాణ్ చేసిన అయ్య జాగీరా వ్యాఖ్యలపై ప్రజాగాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ గడ్డ నిన్న తమ అయ్యల జాగీరేనని, నేడు తమ జాగీరని, రేపు తమ బిడ్డల జాగీరు అవుతుందని ఆమె స్పష్టం చేశారు. నటుడిగా పవన్‌ను అభిమానిస్తామని, కానీ పైసలు పంచితేనో, లాబీయింగ్ చేస్తేనో ఈ రాష్ట్రం రాలేదని చురకలంటించారు. ఎంతోమంది తల్లులు తమ బిడ్డలను కోల్పోయి, ఎన్నో ప్రాణత్యాగాలు చేసి తెచ్చుకున్న ఆత్మగౌరవ పోరాటమే తెలంగాణ ఉద్యమమని ఆమె ఉద్ఘాటించారు. తెలంగాణ అన్నందుకు ఎంతోమంది ఎన్‌కౌంటర్లకు బలయ్యారని, ఉద్యమ సమయంలో ప్రాణాలు తీసుకున్నామే తప్ప ఎవరినీ పల్లెత్తు మాట అనలేదని ఆమె పవన్‌కు హితవు పలికారు.

# మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తం

### అడ్వాన్స్‌డ్ మెడికల్ రీసెర్చ్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు.

### రూ.1200 కోట్లతో థెరానిమ్ బయోలాజిక్స్ కేంద్రం ప్రారంభం

### ప్రాణాంతక వ్యాధులకు ఔషధాల తయారీ, విదేశాలకు ఎగుమతి

### పెట్టుబడులతో స్థానిక యువతకు 1500 ఉపాధి అవకాశాలు




**సంగారెడ్డి, జూన్ 03:** హైదరాబాద్ నగరాన్ని అడ్వాన్స్‌డ్ మెడికల్ రీసెర్చ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక అడుగులు వేస్తోందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బొర్పట్ల గ్రామంలో పన్నెండు వందల కోట్లతో నిర్మించిన థెరానిమ్ బయోలాజిక్స్ తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యాక్సిన్లు జన్యు చికిత్సలు క్యాన్సర్ మరియు అరుదైన వ్యాధుల పరిశోధనల నుంచి ఉత్పత్తి వరకు పూర్తి పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు సమగ్రమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

**గ్లోబల్ బయోటెక్ డెస్టినేషన్**

దేశ ఫార్మా రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను గ్లోబల్ బయోటెక్నాలజీ డెస్టినేషన్‌గా మరింత బలోపేతం చేస్తున్నామని శ్రీధర్ బాబు తెలిపారు. రోబోటిక్స్ కృత్రిమ మేధస్సు మరియు జన్యు సాంకేతికతతో బయోటెక్నాలజీ రంగం రూపురేఖలు మారనున్నాయని వెల్లడించారు. భవిష్యత్తు అవకాశాలను అందిపుచ్చుకుంటూ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దేందుకు ఫార్మా కంపెనీలు ప్రభుత్వంతో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**విశ్వవ్యాప్తంగా మన బ్రాండ్**

లైఫ్ సైన్సెస్ పాలసీ వన్ బయో హబ్ గ్రీన్ ఫార్మా సిటీ లైఫ్ సైన్సెస్ హబ్ వంటి ప్రాజెక్టులతో మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తామని శ్రీధర్ బాబు వివరించారు. లైఫ్ సైన్సెస్ హబ్‌గా ఎదగడంలో థెరానిమ్ కేంద్రం ఒక మైలురాయి అని అభివర్ణించారు. ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు అవసరమైన అత్యాధునిక ఔషధాలను ఇక్కడ తయారు చేసి అమెరికా సహా పలు దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా పదిహేను వందల మందికి పైగా ఉపాధి లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మరియు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు.

# కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

**డిప్యూటీ సీఎంగా జి. పరమేశ్వర, మంత్రులుగా ప్రియాంక్ ఖర్గే, యతీంద్ర సహా 12 మంది ప్రమాణం**

**హాజరైన రాహుల్ గాంధీ, ఖర్గే, రేవంత్ రెడ్డి**

బెంగళూరు, జూన్ 3: కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ బలమైన నేత డీకే శివకుమార్ బుధవారం వైభవంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. లోక్‌భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఈ వేడుకలో రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఆయనతో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు. ఎంతో భావోద్వేగంతో సాగిన ఈ కార్యక్రమంలో డీకే శివకుమార్ భారత రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి ప్రమాణం చేయడం అందరినీ ఆకట్టుకుంది. అంతకుముందు ఆయన వేదికపైకి రాగానే అక్కడకు తరలివచ్చిన ప్రజలకు, అభిమానులకు సాష్టాంగ నమస్కారం చేసి తన కృతజ్ఞతను చాటుకున్నారు.

ఇదే వేదికపై తన సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను డీకే శివకుమార్ శాలువాతో ఘనంగా సత్కరించి పెద్దల పట్ల గౌరవాన్ని ప్రకటించారు. ఈ చారిత్రాత్మక వేడుకకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీలతో పాటు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి, కేరళ సీఎం వీడీ సతీశన్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు మరియు ఇతర ఏఐసీసీ ముఖ్య నేతలు భారీగా హాజరయ్యారు.

ఈ నూతన ప్రభుత్వంలో సీనియర్ నాయకుడు జి. పరమేశ్వర డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేయగా, వారితో పాటు



మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ మంత్రివర్గంలో యువతకు, సీనియార్టీకి సమ ప్రాధాన్యత లభించింది. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, అలాగే కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేలకు ఈ క్యాబినెట్‌లో మంత్రి పదవులు దక్కాయి. వీరితో పాటు కేహెచ్ మునియప్ప, కె.జె.జార్జ్, ఎంబీ పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జర్కిహోళి, కృష్ణబైరె గౌడ, యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌లు నూతన మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. ఈ ఘనమైన ప్రమాణస్వీకార మహోత్సవంతో కర్ణాటకలో సరికొత్త పాలనా అధ్యాయం అధికారికంగా ప్రారంభమైంది.



# ఫలించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కృషి

**రామచంద్రాపురం ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం**

**24 కోట్లతో ఎన్హెచ్-30 విస్తరణకు ఎన్‌హెచ్‌ఏఐ ఆమోదం**

తిరువూరు, జూన్ 03: ఎన్నో దశాబ్దాలుగా తిరువూరు, మైలవరం నియోజకవర్గాల ప్రజలను వేధిస్తున్న రామచంద్రాపురం ట్రాఫిక్ సమస్యకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. తిరువూరు–ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిలోని (ఎన్ హెచ్–30) రామచంద్రాపురం వద్ద ఎదురవుతున్న తీవ్ర రద్దీని నివారించేందుకు, రహదారి విస్తరణ ప్రతిపాదనకు నేషనల్హైవే అథారిటీ అధికారిక ఆమోదం తెలిపింది. సుమారు రూ. 24 కోట్ల అంచనా వ్యయంతో ఇరువైపులా సర్వీస్ రోడ్లతో కూడిన నాలుగు లైన్ల (ఫోర్ లేన్) హైవేగా దీనిని అభివృద్ధి చేయనున్నారు. గత కొన్నేళ్లుగా కేవలం ఒక కిలోమీటర్ దూరం దాటడానికి 20 నిమిషాలకు పైగా సమయం పడుతూ నిత్యం ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఎంపీ చిన్ని.. ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం మరియు ఎన్‌హెచ్‌ఏఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఢిల్లీ మరియు స్థానిక స్థాయిలో ఆయన నిరంతరం జరిపిన ఫాలోఅప్ ఫలితంగానే అన్ని సాంకేతిక, పరిపాలనా అడ్డంకులు తొలగి ఈ నిధుల మంజూరు, ఆమోదం సాధ్యమయ్యాయి.

ఈ సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని, దశాబ్దాల నాటి ఈ ట్రాఫిక్ కష్టాలకు ముగింపు పలకడం ఆనందంగా ఉందన్నారు. రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తానని, ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. నిత్యం విద్య, వైద్యం, వ్యాపార అవసరాల కోసం విజయవాడకు రాకపోకలు సాగించే తమ ప్రధాన రవాణా సమస్యను గుర్తించి, ఇచ్చిన మాట ప్రకారం నిధులు రప్పించిన 'ప్రజా మనిషి' ఎంపీ చిన్ని పట్ల తిరువూరు, మైలవరం ప్రాంతాల ప్రజలు మరియు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# టీఎంసీలో తిరుగుబాటు

**పార్టీని చేజిక్కించుకునే దిశగా రెబల్స్**

**ప్రతిపక్ష హోదా కోసం బహిష్కృత ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ యత్నాలు**

**59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ లేఖ**

**15 మంది ఎంపీలు టచ్‌లో ఉన్నారన్న బీజేపీ!**

కోల్‌కతా, జూన్ 3: తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో అనూహ్యమైన రాజకీయ సంక్షోభం ముదిరింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే నెపంతో సోమవారం సస్పెన్షన్‌కు, బహిష్కరణకు గురైన రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ శాసనసభలో తనను ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ నియమించారని ప్రకటించి సంచలనం సృష్టించారు. తమ తిరుగుబాటు శిబిరాన్ని అధికారిక శాసనసభా పక్షంగా గుర్తించాలన్న అభ్యర్థనను స్పీకర్ అంగీకరించారని, తమకు మమతా బెనర్జీ ముఖ్య సలహాదారుగా వ్యవహరించాలని కోరామని ఆయన వెల్లడించారు.

అసెంబ్లీలో టీఎంసీకి ఉన్న మొత్తం 80 మంది శాసనసభ్యులలో మూడింట రెండొంతుల కంటే ఎక్కువ మంది, అంటే 59 మంది ఎమ్మెల్యేల మద్దతు తమకు ఉందంటూ రితబ్రత స్పీకర్‌కు లేఖ సమర్పించారు. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు పడకుండా ఉండటానికి 53 మంది మద్దతు అవసరం కాగా, అంతకంటే ఎక్కువ బలం ఉండటంతో టీఎంసీ పేరు, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మందికి పైగా ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా కూడా పేర్కొనడం గమనార్హం. అంతకుముందు,



శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం పార్టీలో తీవ్ర కలకలం రేపింది.

మరోవైపు, టీఎంసీలో కొనసాగుతోన్న ఈ అంతర్గత గందరగోళం నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన 15 మంది ఎంపీలు తనను సంప్రదించారని బెంగాల్ బీజేపీ నేత దిబ్యేందు అధికారి ప్రకటించడం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. అయితే, ప్రస్తుతానికి ఎవరినీ పార్టీలోకి చేర్చుకోవద్దని బీజేపీ అధిష్ఠానం నుంచి ఆదేశాలు అందాయని, ఈ విషయంపై పార్టీ అధినేత మాత్రమే తుది నిర్ణయం తీసుకుంటారని ఆయన స్పష్టం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో సంక్షోభం రాబోయే రోజుల్లో మరింత తీవ్రమవడమే కాకుండా, మమతా బెనర్జీ నేతృత్వంలోని ఈ పార్టీ పతనం వైపు పయనిస్తోందని దిబ్యేందు అధికారి వ్యాఖ్యానించారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసి పార్టీని, గుర్తును తమ సొంతం చేసుకునే దిశగా చురుగ్గా అడుగులు వేస్తుండటంతో బెంగాల్ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి.




# ప్రజ్ఞానంద సంచలనం

**నార్వే చెస్ టోర్నీలో ప్రపంచ నంబర్-1 మాగ్నస్ కార్ల్‌సన్‌కు షాక్!**

**కార్ల్‌సన్‌పై భారత యువ గ్రాండ్ మాస్టర్‌కు ఇది రెండో విజయం**

**12 పాయింట్లతో మూడో స్థానానికి దూసుకెళ్లిన ప్రగ్**

**టైటిల్ రేస్ నుండి నిష్క్రమించిన ప్రపంచ ఛాంపియన్ గుకేశ్**

నార్వే, జూన్ 3: నార్వే చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద సరికొత్త చరిత్ర సృష్టించాడు. మంగళవారం జరిగిన హోరాహోరీ పోరులో ప్రపంచ నంబర్–1 ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్‌ను అతడి సొంత గడ్డపైనే ఓడించి చెస్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. కార్ల్‌సన్‌పై ప్రజ్ఞానందకు ఇది రెండో విజయం కావడం విశేషం. ఈ అద్భుత విజయంతో ప్రజ్ఞానంద ప్రస్తుత టోర్నీలో మొత్తం 12 పాయింట్లతో పట్టికలో మూడో స్థానానికి చేరుకున్నాడు. అదే సమయంలో, తన సొంత దేశంలో ఎనిమిదోసారి నార్వే చెస్ టైటిల్‌ను కైవసం చేసుకోవాలన్న కార్ల్‌సన్ ఆశలకు ఈ ఓటమి పెద్ద ఎదురెబ్బగా మారింది. టోర్నీలో ఇంకా కేవలం రెండు రౌండ్లు మాత్రమే మిగిలి ఉండటంతో, డిఫెండింగ్ ఛాంపియన్ టైటిల్‌ను కాపాడుకోవడం కార్ల్‌సన్‌కు కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఆర్మాగెడాన్ టై–బ్రేక్‌లో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను ఓడించడం ద్వారా కార్ల్‌సన్ తన పాయింట్లను 14కు పెంచుకున్నాడు. ప్రస్తుతం అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

మరోవైపు, ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజా ఫిరౌజ్జా.. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్, భారత స్టార్ డి. గుకేశ్‌ను ఓడించి 13 పాయింట్లతో పట్టికలో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఈ ఓటమితో నార్వే చెస్ టైటిల్ గెలుచుకోవాలన్న గుకేశ్ ఆశలు దాదాపుగా ముగిసిపోయాయి. ప్రస్తుతం అతడి ఖాతాలో కేవలం 8 పాయింట్లు మాత్రమే ఉన్నాయి. క్లాసికల్ ఫార్మాట్‌లో మిగిలిన రెండు గేమ్‌లను అతడు గెలిచినా కూడా గరిష్ఠంగా 14 పాయింట్లను మాత్రమే సాధించగలడు, దీంతో అతడు టైటిల్ రేసు నుంచి నిష్క్రమించినట్లయింది. అయితే, మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఇప్పటికే రెండుసార్లు ఓడించిన భారత స్టార్ ప్రజ్ఞానందకు మాత్రం టైటిల్ ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. టైటిల్ రేసులోకి అత్యంత బలంగా దూసుకురావడంతో మిగిలిన రెండు రౌండ్లు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి.




# బంగారం విక్రయం వార్తలు అవాస్తవం

**బ్లూమ్‌బెర్గ్ కథనాన్ని ఖండించిన కేంద్రం!**

**ఆర్‌బీఐ వద్ద తగ్గలేదు.. మరింత పెరిగిన బంగారం నిల్వలు!**

న్యూఢిల్లీ, జూన్ 3: దేశీయ విదేశీ మారకపు ద్రవ్యం నిల్వలను కాపాడుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పెద్దఎత్తున బంగారాన్ని విక్రయించిందంటూ వస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ ప్రముఖ వార్తాసంస్థ 'బ్లూమ్‌బెర్గ్' ప్రచురించిన ఈ కథనాన్ని ప్రభుత్వం పూర్తిగా తోసిపుచ్చింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా దేశ ఇంధన దిగుమతుల బిల్లు భారీగా పెరగడం, విదేశీ మదుపర్లు భారత ఈక్విటీలను విక్రయించి పెట్టుబడులను వెనక్కి తీసుకెళ్లిపోతుండటంతో అమెరికా డాలర్‌కు గిరాకీ బాగా పెరిగిందని బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. ఈ పరిణామాల వల్ల రూపాయి విలువ పడిపోకుండా ఫారెక్స్ నిల్వలను రక్షించుకోవడానికి ఆర్‌బీఐ సుమారు 12 బిలియన్ డాలర్ల విలువైన పసిడిని విక్రయించినట్లు ఆ సంస్థ తన కథనంలో తెలిపింది. అయితే, ఈ పసిడి విక్రయ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇవి పూర్తి అవాస్తవాలని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా అధికారికంగా స్పష్టం చేసింది.

ఈ తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి చెందిన అధికారిక గణాంకాలను విడుదల చేసింది. ఆర్‌బీఐ వద్ద ఉన్న మొత్తం ఫారెక్స్ నిల్వల్లో బంగారం వాటా 2025లో 13.92 శాతంగా ఉండగా.. అది 2026 మార్చి 31 నాటికి 16.70 శాతానికి పెరిగిందని వెల్లడించింది. అంతేకాకుండా, తాజా సమీక్ష ప్రకారం మే 22 నాటికి ఈ పసిడి నిల్వల వాటా మరింత వృద్ధి చెంది 16.85 శాతానికి చేరినట్లు ఆర్‌బీఐ గణాంకాలను ఉదహరిస్తూ స్పష్టం చేసింది. ఆర్‌బీఐ తన వద్ద ఉన్న ఫిజికల్ గోల్డ్ వివరాలను ఎప్పటికప్పుడు తన నెలవారీ బులెటిన్‌లో పారదర్శకంగా వెల్లడిస్తూనే ఉంటుందని, ప్రస్తుత తేదీ వరకు అందులో ఎలాంటి నిల్వల తగ్గింపు మార్పూ లేదని స్పష్టం చేసింది. కాబట్టి ఇటువంటి తప్పుడు మరియు ఊహాజనిత సమాచారాన్ని మార్కెట్ వర్గాలు, ప్రజలు నమ్మవద్దని, ఏదైనా నమ్మకమైన అధికారిక సమాచారం కోసం ఆర్‌బీఐ అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే సందర్శించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది.



# కివీస్ గడ్డపై టీమ్ఇండియా సుదీర్ఘ పర్యటన

**40 రోజుల పాటు 5 టీ20లు, 5 వన్డేలు, 2 టెస్టుల సిరీస్**

**న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద పర్యటన**

న్యూఢిల్లీ, జూన్ 3: టీమ్ఇండియా అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1 వరకు న్యూజిలాండ్‌లో సుదీర్ఘ పర్యటన చేపట్టనుంది. మొత్తంగా 40 రోజుల పాటు సాగే ఈ ప్రతిష్ఠాత్మక పర్యటనలో ఇరు జట్లు 5 టీ20లు, 5 వన్డేలు, మరియు 2 టెస్ట్ మ్యాచ్‌లలో తలపడనున్నాయి. న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలోనే ఏ విదేశీ జట్టు కూడా ఒకే పర్యటనలో ఇన్ని మ్యాచ్‌లు ఆడకపోవడంతో, ఇది ఆ దేశ చరిత్రలోనే అతిపెద్ద పర్యటనగా రికార్డు సృష్టించనుంది. అంతేకాకుండా, ఈ సిరీస్ భారత్–న్యూజిలాండ్ దేశాల మధ్య నెలకొన్న వందేళ్ల సుదీర్ఘ క్రీడా సంబంధాలకు ఒక సముచిత ప్రతీకగా నిలవనుంది. భారత్ చివరిసారిగా 2019–20 సీజన్‌లో న్యూజిలాండ్‌లో పర్యటించగా, ఆ తర్వాత కివీస్ జట్టు రెండుసార్లు భారత్‌లో పర్యటించింది. ముఖ్యంగా గత 2024–25 టూర్‌లో కివీస్ జట్టు భారత్‌ను భారత్‌లోనే 3–0 తేడాతో టెస్ట్ సిరీస్‌లో క్లీన్ స్వీప్ చేసిన నేపథ్యంలో, ఈ సుదీర్ఘ పర్యటన అభిమానులకు అసలైన వినోదాన్ని పంచనుంది.

ఈ ప్రతిష్ఠాత్మక పర్యటనకు సంబంధించిన పూర్తి మ్యాచ్‌ల షెడ్యూల్ వివరాలు:

**భారత్ - న్యూజిలాండ్ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్:**

**టీ20 సిరీస్ (అక్టోబర్ 22 నుంచి నవంబర్ 1):**
మొదటి టీ20: అక్టోబర్ 22 -- క్రైస్ట్‌చర్చ్
రెండో టీ20: అక్టోబర్ 24 -- క్రైస్ట్‌చర్చ్
మూడో టీ20: అక్టోబర్ 27 -- వెల్లింగ్టన్
నాలుగో టీ20: అక్టోబర్ 30 -- ఆక్లాండ్
అయిదో టీ20: నవంబర్ 1 -- హామిల్టన్

**వన్డే సిరీస్ (నవంబర్ 4 నుంచి నవంబర్ 15):**
తొలి వన్డే: నవంబర్ 4 -- ఆక్లాండ్
రెండో వన్డే: నవంబర్ 7 -- వెల్లింగ్టన్
మూడో వన్డే: నవంబర్ 10 -- హామిల్టన్
నాలుగో వన్డే: నవంబర్ 13 -- మౌంట్ మాంగనూయి
అయిదో వన్డే: నవంబర్ 15 -- మౌంట్ మాంగనూయి

**టెస్ట్ సిరీస్ (నవంబర్ 19 నుంచి డిసెంబర్ 1):**
మొదటి టెస్ట్: నవంబర్ 19 నుంచి 23 వరకు -- వెల్లింగ్టన్
రెండో టెస్ట్: నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు -- క్రైస్ట్‌చర్చ్

# భారత్‌పై అదనపు సుంకాల ప్రతిపాదన

**బలవంతపు శ్రమ లేదా వెట్టిచాకిరి ద్వారా తయారవుతున్న వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో తగిన చర్యలు తీసుకోవడం లేదనే కారణంతో భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 60 దేశాలపై అదనపు దిగుమతి సుంకాలు విధించాలని అమెరికా వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం అమెరికా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొన్ని దేశాల్లో పెరుగుతున్న పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యం కూడా ప్రపంచ వాణిజ్య సమతుల్యతను దెబ్బతీస్తోందని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది.**



న్యూఢిల్లీ, జూన్ 3

అమెరికా వాణిజ్య చట్టంలోని ప్రత్యేక నిబంధనల ప్రకారం ఈ ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. బలవంతపు శ్రమతో తయారయ్యే ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశించకుండా కట్టడి చేయడంలో పలు దేశాలు మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా అభిప్రాయపడుతోంది. ఈ నేపథ్యంలోనే సంబంధిత దేశాలపై అదనపు సుంకాల విధింపు అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ పరిణామాలపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ స్పందించింది. అమెరికా వ్యక్తం చేసిన ఆందోళనలపై ఇరు దేశాల మధ్య ఇప్పటికే చర్చలు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది. వెట్టిచాకిరి నిర్మూలన విషయంలో భారత్ కట్టుబడి ఉందని, ఈ అంశంపై దేశంలో అమలవుతున్న చట్టాలు, చర్యల గురించి అమెరికా అధికారులకు వివరిస్తున్నట్లు తెలిపింది.భారత్, అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలనే లక్ష్యంతో సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కేంద్రం పేర్కొంది. అదనపు సుంకాల అంశంపై ఏర్పడిన తాజా వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు దౌత్యపరమైన సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించింది.ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య చాలా కాలంగా చర్చల్లో ఉన్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి జరుగుతోందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

# పెట్రోల్ వినియోగం పెరుగుదల..

**భారత ఇంధన మార్కెట్‌లో ఇటీవలి కాలంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పెట్రోలియం ప్రణాళిక మరియు విశ్లేషణ విభాగం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, దేశంలో డీజిల్‌తో పోలిస్తే పెట్రోల్ వినియోగం వేగంగా పెరుగుతోంది. 2026 మే నెల నాటికి పెట్రోల్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 2.8 శాతం పెరిగి 3,888 వేల మెట్రిక్ టన్నులకు చేరుకుంది.**




### ఎల్‌పీజీ, ఎగుమతుల్లో తగ్గుదల

వ్యక్తిగత వాహనాల వినియోగం పెరగడం, ప్రజల ప్రయాణ విధానాల్లో వచ్చిన మార్పులు, ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వంటి అంశాలు ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. డీజిల్ వినియోగంలో కూడా స్వల్ప వృద్ధి నమోదైనప్పటికీ, పెట్రోల్ డిమాండ్‌తో పోలిస్తే అది తక్కువగానే ఉంది. వ్యక్తిగత రవాణా సాధనాలపై ప్రజలు ఎక్కువగా ఆధారపడటం వల్ల పెట్రోల్ విక్రయాలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో కూడా ఈ ధోరణి కొనసాగుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

### ఎల్‌పీజీ వినియోగంలో భారీ తగ్గుదల


దేశంలో అత్యధికంగా తగ్గుదల నమోదైన ఇంధనంగా ఎల్‌పీజీ నిలిచింది. 2026 మే నెలలో ఎల్‌పీజీ వినియోగం 19.16 శాతం క్షీణించి 21.2 లక్షల టన్నులకు పడిపోయింది. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఇంధన దిగుమతుల్లో అంతరాయాలు ఏర్పడటం దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. సరఫరా సమస్యలను నియంత్రించేందుకు ప్రభుత్వం వాణిజ్య వినియోగదారులకు గ్యాస్ పంపిణీపై కొన్ని పరిమితులు విధించింది. అలాగే బుకింగ్ నిబంధనలను కఠినతరం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగడంతో సాధారణ వినియోగదారులు, వ్యాపార వర్గాలు ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మొగ్గు చూపుతున్నాయి. ఫలితంగా ఎల్‌పీజీ వినియోగం గణనీయంగా తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

### ఇంధన ఎగుమతుల్లో క్షీణత

భారతదేశం నుంచి జరుగుతున్న పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు కూడా క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి.2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ మొత్తం ఎగుమతుల్లో పెట్రోలియం ఉత్పత్తుల వాటా 8.8 శాతానికి పడిపోయింది. ఇది గత పదేళ్లలోనే అత్యల్ప స్థాయిగా నమోదైంది. ముఖ్యంగా డీజిల్, విమానయాన ఇంధన ఎగుమతులు వరుసగా తగ్గుతూ వస్తున్నాయి. గత మూడు సంవత్సరాలుగా డీజిల్ ఎగుమతులు క్షీణిస్తుండగా,విమానయాన ఇంధన ఎగుమతులు 20 శాతానికి పైగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ మందగించడం, సరఫరా వ్యవస్థలో ఏర్పడిన అస్థిరత ఈ పరిస్థితికి కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.దేశీయ వినియోగం పెరుగుతున్నప్పటికీ, విదేశీ మార్కెట్లలో డిమాండ్ బలహీనపడటం రిఫైనరీల ముందు కొత్త సవాళ్లను తీసుకొస్తోంది. భారత ఇంధన రంగ భవిష్యత్తు అంతర్జాతీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఐపీఎల్-2027కు కమిన్స్ దూరమా?

**సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులను ఆందోళనకు గురిచేసే వార్త ఒకటి క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆస్ట్రేలియా స్టార్ పేసర్, ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఐపీఎల్--2027 సీజన్‌కు దూరంగా ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.**




### ఎస్ఆర్‌హెచ్‌లో చర్చనీయాంశం

హైదరాబాద్, జూన్ 3

వచ్చే ఏడాది ఆస్ట్రేలియా జట్టుకు అత్యంత కీలకమైన అంతర్జాతీయ షెడ్యూల్ ఉండనుంది. యాషెస్ సిరీస్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్, వన్డే ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలు వరుసగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో జట్టుకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో కమిన్స్ ఐపీఎల్‌కు విరామం ఇవ్వాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.నిరంతర క్రికెట్ కారణంగా శారీరక అలసట, గాయాల ప్రమాదం పెరుగుతుందని భావిస్తున్న కమిన్స్, జాతీయ జట్టు బాధ్యతలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. గతంలో కూడా పలువురు ఆస్ట్రేలియా ఆటగాళ్లు అంతర్జాతీయ టోర్నీల దృష్ట్యా ఐపీఎల్‌కు దూరమైన సందర్భాలు ఉన్నాయి.ఒకవేళ కమిన్స్ నిజంగానే ఐపీఎల్--2027లో ఆడకపోతే సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్త కెప్టెన్ ఎంపికపై దృష్టి సారించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న ఇషాన్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించే అవకాశముందని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.అయితే కమిన్స్ భవిష్యత్తు, ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్సీపై ప్రస్తుతం అధికారిక స్పష్టత లేదు. ఫ్రాంచైజీ లేదా ఆటగాడి నుంచి ప్రకటన వెలువడే వరకు ఈ వార్తలను ఊహాగానాలుగానే పరిగణించాల్సి ఉంటుంది. ఎస్ఆర్‌హెచ్ అభిమానులు మాత్రం కమిన్స్ జట్టుతోనే కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నెలలో 8.2 లక్షల క్రెడిట్ కార్డులు జారీ

**ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్--2026కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల సంయుక్త ఆతిథ్యంలో జూన్ 11 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. భారత జాతీయ జట్టు ఈ ప్రపంచకప్‌కు అర్హత సాధించకపోయినా, భారతీయ మూలాలున్న ముగ్గురు యువ ఫుట్‌బాలర్లు వేర్వేరు దేశాల తరఫున బరిలోకి దిగనుండటం భారత అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.**




న్యూఢిల్లీ, జూన్ 3 (రుద్రన్యూస్) :

ఖతార్ జట్టుకు ఎంపికైన తహ్సీన్ మహ్మద్ జంషీద్ ఈ జాబితాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కేరళలోని కన్నూర్ జిల్లాకు చెందిన మలయాళీ కుటుంబ మూలాలు కలిగిన తహ్సీన్ ప్రస్తుతం ఖతార్ లీగ్‌లో అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందాడు. కేవలం 19 ఏళ్ల వయసులోనే ప్రపంచకప్ తుది జట్టులో స్థానం సంపాదించడం ద్వారా అతడు అరుదైన ఘనతను అందుకున్నాడు.న్యూజిలాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సర్‌ప్రీత్ సింగ్ కూడా భారతీయ మూలాలున్న ప్రముఖ ఆటగాడు. పంజాబీ కుటుంబానికి చెందిన ఆయన, న్యూజిలాండ్ తరఫున కీలక మిడ్‌ఫీల్డర్‌గా రాణిస్తున్నాడు. గతంలో యూరప్‌లోని ప్రముఖ క్లబ్‌ల తరఫున ఆడిన అనుభవం కలిగిన సర్‌ప్రీత్, న్యూజిలాండ్ ప్రపంచకప్ అర్హత సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.ఆస్ట్రేలియా జట్టులో చోటు దక్కించుకున్న నిషాన్ వేలుపిళ్లై మరో భారతీయ మూలాల ఆటగాడు. తమిళ కుటుంబ నేపథ్యం కలిగిన నిషాన్, వేగవంతమైన వింగర్‌గా గుర్తింపు పొందాడు. ప్రపంచకప్‌లో ఆడనున్న తొలి తమిళ సంతతి ఫుట్‌బాలర్‌గా ఆయన చరిత్ర సృష్టించనున్నాడు.ఇక భారతీయ మూలాలున్న మరో ఆటగాడు నైలు ఆద్య మేసన్ తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఫిట్‌నెస్ సమస్యలు, జట్టు సమీకరణాల కారణంగా అతని పేరు చివరి క్షణంలో జాబితా నుంచి తప్పించబడింది.

# ఆఫ్ఘాన్ టెస్టుకు సిరాజ్ ఆడటంపై సందిగ్ధత

టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు అందుబాటులో ఉండటంపై అనిశ్చితి నెలకొంది. ఇటీవల ముగిసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో వరుసగా మ్యాచ్‌లు ఆడిన నేపథ్యంలో అతనిపై పనిభారం పెరగడంతో విశ్రాంతి ఇవ్వాలా అనే అంశాన్ని భారత జట్టు యాజమాన్యం పరిశీలిస్తోంది. ఈ విషయంపై వచ్చే రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.జూన్ 6 నుంచి చండీగఢ్‌లోని న్యూ పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ మైదానంలో భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్టు ప్రారంభం కానుంది. గుజరాత్ టైటాన్స్ తరఫున ఐపీఎల్ మొత్తం సీజన్ ఆడిన సిరాజ్ ఫైనల్ వరకు జట్టుతో కొనసాగాడు. దీంతో అతనికి విశ్రాంతి అవసరమని వైద్య బృందం, జట్టు నిర్వహణ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సిరాజ్ జట్టుతో కలిసి చండీగఢ్‌లోనే ఉండి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉన్నాడు.ఒకవేళ సిరాజ్‌కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయిస్తే, జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ పేసర్ అకీబ్ నబీకి జట్టులో అవకాశం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అకీబ్ నబీ 2025-26 రంజీ సీజన్‌లో 60 వికెట్లు పడగొట్టి తన జట్టును ఛాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం నెట్ బౌలర్‌గా భారత జట్టుతో ఉన్న అతడిని ప్రధాన జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది.అదే సమయంలో యువ పేసర్ గుర్నూర్ బ్రార్ టెస్టు అరంగేట్రం చేసే సూచనలు కూడా బలంగా కనిపిస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌పై పూర్తిగా అనుభవంలేని బౌలింగ్ దళంతో బరిలోకి దిగడం సెలక్టర్లకు ఇష్టం లేకపోయినా, సిరాజ్ గైర్హాజరీలో యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు.ఈ మ్యాచ్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగం కాకపోయినా, భవిష్యత్ సిరీస్‌లకు జట్టును సిద్ధం చేసే దిశగా కీలకంగా మారింది. అనంతరం ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ కూడా జరగనుంది. ఆటగాళ్ల ఫిట్‌నెస్, పనిభార నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి సిరాజ్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. అతడు ఆడతాడా లేదా అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది.



# 'పెద్ది'కి పవన్ ఆశీస్సులు మెగా అభిమానుల్లో జోష్

హైదరాబాద్, జూన్ 3

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన భారీ క్రీడా నేపథ్య చిత్రమైన 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో మెగా అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, జనసేన అధినేత, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పంచుకున్న ప్రత్యేక వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. 'పెద్ది' ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ రూపొందించిన ఈ వీడియోలో రామ్ చరణ్ సినీ ప్రయాణానికి సంబంధించిన పలు చిత్రాల దృశ్యాలను అందంగా మేళవించారు. చరణ్ వ్యక్తిత్వా న్ని ఆంజనేయస్వామి ప్రతీకతో అనుసంధానం చేస్తూ రూపొందించిన వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మెగా అభిమానుల్లో చాలామంది రామ్ చరణ్‌ను ఆంజనేయస్వామి అంశగా భావిస్తుంటారు. ఆయన ధైర్యం, క్రమశిక్షణ, వ్యక్తిత్వం ఆంజనేయస్వామిని గుర్తు చేస్తాయని అభిమానులు అభిప్రాయపడుతుంటారు. ఈ భావనకు అనుగుణంగా వీడియోలో చరణ్ నటించిన పలు చిత్రాల సన్నివేశాలతో పాటు ఆంజనేయస్వామికి సంబంధించిన ప్రతీకాత్మక దృశ్యాలను జోడించారు.



'కిల్లర్' షూటింగ్‌లో విషాదంసిలిండర్

# పేలుడులో టెక్నీషియన్ మృతి

చెన్నై, జూన్ 3

నటుడు, దర్శకుడు ఎస్. జే. సూర్య ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'కిల్లర్' సినిమా షూటింగ్ సందర్భంగా ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నైలోని పెరంబూర్ బిన్నీ మిల్స్ కాంప్లెక్స్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఒక టెక్నీషియన్ మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సినిమాలోని బాంబు పేలుడు సన్నివేశం చిత్రీకరణ కోసం ప్రత్యేక ప్రభావాల విభాగం ఏర్పాట్లు చేస్తున్న సమయంలో యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం ఉపయోగిస్తున్న గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలిపోయినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ప్రత్యేక ప్రభావాల బృందానికి చెందిన నలుగురు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు.గాయపడిన వారిలో మధుర వాయల్‌కు చెందిన 25 ఏళ్ల మదన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. దినకరన్, సూర్య, శక్తివేల్ అనే మరో ముగ్గురు టెక్నీషియన్లను వెంటనే చెన్నై రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు నిశితంగా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.సమాచారం అందుకున్న వెంటనే ఓట్టేరి పోలీసులు, అత్యవసర సహాయక బృందాలు ఘట నాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక లోపం వల్ల ప్రమాదం జరిగిందా, లేక భద్రతా నిబంధనల అమలులో నిర్లక్ష్యం జరిగిందా అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది.





# అబద్ధపు వేధింపుల కేసు పెట్టానన్న నటి శిల్పా షిండే..

ముంబై, జూన్ 3

ప్రముఖ టెలివిజన్ నటి శిల్పా షిండే చేసిన తాజా వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దాదాపు పదేళ్ల క్రితం ఓ నిర్మాతపై తాను అబద్ధపు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశానని ఆమె స్వయంగా వెల్లడించడంతో సోషల్ మీడియా, టెలివిజన్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'భాభీజీ ఘర్ పర్ హైన్!' సీరియల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన శిల్పా షిండే ఇటీవల ఓ పోడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన వివాదంపై స్పందిస్తూ, 2017లో నిర్మాత సంజయ్ కోహ్లిపై నమోదు చేసిన లైంగిక వేధింపుల ఫిర్యాదు నిజం కాదని అంగీకరించారు. ఆ సమయంలో కాంట్రాక్ట్‌కు సంబంధించిన వివాదాలు, పెండింగ్ చెల్లింపులు తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయని, గత్యంతరం లేక ఆ కేసు పెట్టాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. అనంతరం తనకు రావాల్సిన చెల్లింపులు అందిన తర్వాత ఇరు పక్షాలు కోర్టు వెలుపల రాజీ చేసుకుని కేసును ముగించుకున్నట్లు వెల్లడించారు. శిల్పా చేసిన ఈ వ్యాఖ్యలపై ఢిల్లీలోని పురుషుల హక్కుల కోసం పనిచేస్తున్న ఓ సంస్థ తీవ్రంగా స్పందించింది. తప్పుడు లైంగిక వేధింపుల కేసు పెట్టినట్లు స్వయంగా అంగీకరించిన నేపథ్యంలో ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అరెస్ట్ చేయాలని ముంబై పోలీసులను కోరింది. నిజమైన బాధితులకు రక్షణ కల్పించేందుకు రూపొందించిన చట్టాలను దుర్వినియోగం చేయడం ఆందోళనకరమని ఆ సంస్థ పేర్కొంది. ఇలాంటి ఘటనలు చట్టాల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. ఇక శిల్పా వ్యాఖ్యలపై సినీ, టెలివిజన్ వర్గాల్లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమెను తీవ్రంగా విమర్శిస్తుండగా, మరికొందరు నిజాన్ని బహిరంగంగా ఒప్పుకున్నందుకు ఆమె ధైర్యాన్ని అభినందిస్తున్నారు. ప్రస్తుతం శిల్పా షిండే, నిర్మాత సంజయ్ కోహ్లి కుటుంబంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. అయితే ఆమె తాజా వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వ్యవహారం మళ్లీ చర్చకు రావడంతో, భవిష్యత్తులో దీనిపై మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

'పెద్ది' విడుదలకు ముందే

# మెగా హంగామా

హైదరాబాద్, జూన్ 3

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' సినిమా విడుదలకు ముందే తెలుగు రాష్ట్రాల్లో అభిమానుల సందడి ఊపందుకుంది. దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ చిత్రంపై భారీ అంచనాలు నెలకొనడంతో అభిమానులు ఇప్పటికే థియేటర్ల వద్ద పండుగ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతం అభిమానుల సందడికి కేంద్రంగా మారింది. అర్జున్ థియేటర్ ఆవరణలో 'పెద్ది' సినిమాలో రామ్ చరణ్ పోషించిన పాత్రను ప్రతిబింబించేలా భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహానికి 'శ్రీ రామ్ చరణ్ ఆలయం' అనే పేరుతో ప్రత్యేక ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం విశేషంగా మారింది. గ్రామీణ నేపథ్యంలోని 'పెద్ది' పాత్రను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ విగ్రహం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. అభిమానులు పెద్ద సంఖ్యలో థియేటర్ వద్దకు చేరుకుని ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ సందడి చేశారు. కొందరు అభిమానులు విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించగా, మరికొందరు కర్పూర హారతులు ఇచ్చి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు.డప్పులు, బ్యానర్లు, నినాదాలతో థియేటర్ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి.



# క్యాన్సర్‌ను జయించిన హంసా నందిని..

హైదరాబాద్, జూన్ 3

సినీ ఇండస్ట్రీలో హీరోయిన్‌గా రాణించాలని ఎంతో మంది కలలు కంటూ అడుగుపెడతారు. అయితే కొందరికి మాత్రమే స్టార్‌డమ్ దక్కుతుంది. మరికొందరు అవకాశాల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటారు. అలాంటి నటీమణుల్లో ఒకరు హంసా నందిని. పూణెలో జన్మించి పెరిగిన హంసా నందిని మోడలింగ్‌పై ఆసక్తితో ముంబైకి వెళ్లారు. 2002 నుంచి మోడలింగ్ రంగంలో కొనసాగుతూ పలు టెలివిజన్ ప్రకటనల్లో నటించారు. అనంతరం 2004లో విడుదలైన ఒకటవుదాం చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. హీరోయిన్‌గా పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయారు. దీంతో కొన్ని సినిమాల్లో రెండో కథానాయికగా నటించారు. అయినప్పటికీ పెద్దగా గుర్తింపు రాకపోవడంతో ప్రత్యేక గీతాల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 2013లో విడుదలైన మిర్చి, భాయ్, అత్తారింటికి దారేది, రామయ్యా వస్తావయ్యా, అలాగే లెజెండ్ చిత్రాల్లో చేసిన స్పెషల్ సాంగ్స్‌తో హంసా నందిని మంచి గుర్తింపు సంపాదించారు. అయితే కెరీర్ మంచి దశలో ఉండగానే 2021లో ఆమెకు రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు వెల్లడించారు.



# తారక్‌తోనే బెస్ట్ కెమిస్ట్రీ.. ఇలియానా వ్యాఖ్యలు వైరల్

హైదరాబాద్, జూన్ 3

ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన ఇలియానా డి క్రూజ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తున్న ఆమె గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఎన్.టి. రామారావు జూనియర్ గురించి ఆమె చేసిన కామెంట్స్ నందమూరి అభిమానులను ఆనందంలో ముంచెత్తుతున్నాయి.

**తెలుగు సినీ పరిశ్రమలో మహేష్ బాబు, ప్రభాస్, రామ్, తారక్ వంటి అగ్ర హీరోలతో కలిసి నటించిన ఇలియానా, ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. "మీరు నటించిన హీరోల్లో ఎవరితో మీ స్క్రీన్ కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అయింది?" అని యాంకర్ ప్రశ్నించగా, కాసేపు ఆలోచించిన ఇలియానా "తారక్‌తోనే నా స్క్రీన్ కెమిస్ట్రీ బెస్ట్" అని చెప్పడం విశేషం.**

ఇలియానా, తారక్ కాంబినేషన్‌లో వచ్చిన రాఖీ, శక్తి చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నా యి. ముఖ్యంగా 'రాఖీ' సినిమాలో వీరిద్దరి మధ్య సాగే ప్రేమకథ, పాటలు మంచి ఆదరణ పొందాయి. తారక్ ఎనర్జీకి తగ్గట్టుగా ఇలియానా చేసిన డ్యాన్స్ ప్రదర్శనలు కూడా అప్పట్లో విశేషంగా ఆకట్టుకున్నాయి.



అయితే ఇలియానా కెరీర్‌లో పోకిరి, మున్నా, దేవదాసు వంటి భారీ విజయాలు ఉన్నప్పటికీ, నటన పరంగా మరియు స్క్రీన్‌పై అనుబంధం పరంగా తారక్‌తో ప్రత్యేకమైన కెమిస్ట్రీ ఉందని ఆమె అభిప్రాయపడినట్లు అభిమానులు భావిస్తున్నారు. ఇలియానా చేసిన ఈ వ్యాఖ్యలు పాతవే అయినప్పటికీ, ప్రస్తుతం తారక్ గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందుతున్న నేపథ్యంలో ఈ వీడియోను అభిమానులు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. "తారక్‌తో ఇలియానా జోడీ ఎప్పటికీ ప్రత్యేకమే" అంటూ నందమూరి అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.



# 'కరుప్పు' విజయం తర్వాత విజయ్‌ను కలిసిన దర్శకుడు

చెన్నై, జూన్ 3

భారీ విజయాన్ని అందుకున్న 'కరుప్పు' చిత్ర దర్శకుడు ఆర్‌జే బాలాజీ తాజాగా తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'కరుప్పు' కథను తొలిసారిగా విన్న వ్యక్తి విజయ్ అని గుర్తు చేసుకుంటూ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

**ముఖ్యమంత్రి హోదాలో విజయ్‌ను కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, ఆయనలో ఇప్పటికీ అదే ప్రేమ, ఆప్యాయత, ప్రశాంతత కనిపిస్తున్నాయని ఆర్‌జే బాలాజీ సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు. ప్రస్తుతం 'కరుప్పు' చిత్రం భారీ వసూళ్లతో విజయవంతంగా ప్రదర్శితమవుతూ ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది.**

ఈ చిత్రంలో సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో నటించగా, కథ, కథనాలతో పాటు భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విడుదలైన నాటి నుంచి మంచి స్పందన అందుకుంటున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను నమోదు చేస్తోంది.

**వాస్తవానికి 'కరుప్పు' కథను ఆర్‌జే బాలాజీ మొదట విజయ్ కోసం సిద్ధం చేశారు. రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించకముందు విజయ్ నటించే చిత్రంగా దీనిని తెరకెక్కించాలని భావించి కథను కూడా వినిపించారు. అయితే ఆ సమయంలో రాజకీయ బాధ్యతలు, ఇతర కారణాల దృష్ట్యా విజయ్ ఈ ప్రాజెక్ట్‌లో నటించలేకపోయారు.**

అయినప్పటికీ కథపై విజయ్ ఇచ్చిన సూచనలు, అడిగిన ప్రశ్నలు స్క్రిప్ట్‌ను మరింత మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించాయని ఆర్‌జే బాలాజీ గతంలో వెల్లడించారు. అందుకే చిత్ర ప్రారంభ శీర్షికల్లో విజయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విజయ్ ఈ ప్రాజెక్ట్‌కు దూరమైన తర్వాత ఈ కథ ప్రముఖ నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌కు చేరగా, అనంతరం హీరో సూర్య ఈ చిత్రంలో నటించేందుకు అంగీకరించారు. చివరకు సూర్య ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'కరుప్పు' ఘన విజయాన్ని సొంతం చేసుకుని ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467